PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 66 | పేజీలు : 8 | గురువారం 6 ఆగస్టు 2026 | వెల : 4/-






## మౌలిక సదుపాయాలు విస్తరించాయి

- ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రజల జీవితాల్లో చాలా మార్పులు వచ్చాయి
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత- జమ్మూకశ్మీర్ విద్య, వైద్యం, వ్యాపార, క్రీడా రంగాలు మెరుగయ్యాయ్
- ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాపార, క్రీడలు వంటి రంగాల్లో అవకాశాలు

## నిరసనల వేళ పోలీసులు సంయమనం పాటించాలి

- యువతపై కఠినంగా వ్యవహరించడం సరికాదు
- మార్చ్ టూ పార్లమెంట్ విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- రాళ్లు విసిరిన యువతపై కఠినంగా వ్యవహరించడం సరికాదని వ్యాఖ్య
- విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి, వారి సమస్యను వినాలన్న సుప్రీం
- యువత హింసకు పాల్పడకుండా ఉండేలా మనం జాగ్రత్తగా వ్యవహరించాలి



## ముడుపుల లెక్కచెప్పే.. నీతిమాటలు



- కట్టుకథలతో ఆరోపణలు చేయడమే హరీశ్‌రావు పని
- “బీఆర్ఎస్ అధికారంలో ఉన్న ఏ రోజూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేదు
- అధికారం కోల్పోవడంతో హరీశ్‌రావు ఆరోపణలు చేస్తున్నారు
- ఏపీకి అమ్ముడుపోయి ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు
- కట్టుకథలతో ఆరోపణలు చేయడమే ఆయన పని
- తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకూడదని ఏపీ ప్రతిసారి కోరుతూ వచ్చింది.

హైదరాబాద్

తెలంగాణ ప్రాజెక్టులను ఏపీ ప్రభుత్వం 12 ఏళ్లుగా వ్యతిరేకిస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పరోక్షంగా ఆ రాష్ట్ర ప్రాజెక్టులకు మద్దతిచ్చిందని చెప్పారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. “బీఆర్ఎస్ అధికారంలో ఉన్న ఏ రోజూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేదు. అధికారం కోల్పోవడంతో హరీశ్‌రావు ఆరోపణలు చేస్తున్నారు. ఏపీకి అమ్ముడుపోయి ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు. కట్టుకథలతో ఆరోపణలు చేయడమే ఆయన పని. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకూడదని ఏపీ ప్రతిసారి కోరుతూ వచ్చింది. అనుమతులు వచ్చాక కూడా సమీక్షించాలని ప్రస్తావిస్తూనే ఉంది. నీటి పంపిణీ కోసం ఒప్పందం లేదా ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని ఆనాడు బీఆర్ఎస్ కోరింది. - మిగతా3లో



## జమ్మూకశ్మీర్, లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమే

- భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు పాక్ దుష్ప్రచారం
- దాయాదికి కేంద్రం చురకలు
- జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలు భారత్‌లో అంతర్భాగమేనని వ్యాఖ్యానించిన జైస్వాల్
- భారత్‌పై ఆరోపణలు చేయడం కంటే ముందుగా పీఓకేలో జరుగుతున్న రక్తపాతాన్ని ఆపాలని సూచన

## త్వరగా సమావేశం ఏర్పాటు చేయండి

### ‘తుమ్మిడిహెట్టి’ అంశంపై మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోండి

### ఆ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులివ్వండి

- జల్‌శక్తి మంత్రికి సీఎం రేవంత్ విజ్ఞప్తి
- కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపు అంశంపై సమావేశంలో చర్చ
- పాలమూరు-రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలి
- సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు వెంటనే మంజూరు చేయాలి



హైదరాబాద్

ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో ఆ రాష్ట్రానికి ముంపు ప్రభావం పెద్దగా ఉండదని వివరించారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను ఆయన కార్యాలయంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి భేటీ అయ్యారు. గతంలో తుమ్మిడి హెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాన్ని వివరించారు. 152 మీటర్ల ఎత్తు వరకు బ్యారేజీ నిర్మించినా ముంపులో - మిగతా3లో

## ఇకపై ఎరువుల బుకింగ్‌కు బయోమెట్రిక్?!

- విజిలెన్స్ తనిఖీల్లో బయటపడ్డ అక్రమాలు
- ఎరువుల యాప్ వినియోగంపై పరిశీలనలు
- రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల్లోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు
- రూ. 1.34 కోట్ల విలువైన ఎరువుల్ని దారి మళ్లించినట్లు గుర్తింపు




హైదరాబాద్

పంటల దిగుబడికి ఎరువుల అవసరం రైతన్నలకు ఎంతో ఉంటుంది. దానిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎరువుల కొరత లేకుండా చూసుకుంటుంది. ఈ ఏడాది ఖరీఫ్ సాగు కీలకదశకు చేరుకుంటున్నందున ఎరువుల కొరతపై ప్రభుత్వం అధ్యయనం చేసింది. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు కొద్దిరోజుల క్రితం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. రైతులకు ఎరువుల కోసం ఓ యాప్‌ను రూపొందించారు. దాని వినియోగంపై కూడా పరిశీలించారు. అందులో పలు లోపాల్ని గుర్తించి పంపించాయి. అలాగే దీనిపై కీలక సిఫార్సులు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ బృందాలు 8 జిల్లాల్లోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాయి. ఆ తనిఖీల్లో రూ. 1.34 కోట్ల విలువైన ఎరువుల్ని దారి మళ్లించినట్లు తేలింది. స్టాక్ రిజిస్టర్లతో పోల్చి చూడటంతో ఈ విషయం బయటపడింది. వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల తనిఖీల్లో 17.9 టన్నుల పొటాష్ దారి మళ్లినట్టు గుర్తించారు. మేడ్చల్ విజిలెన్స్ యూనిట్ తనిఖీల్లో 4.75 టన్నుల ఎరువులతోపాటు 71.8 లీటర్ల క్రిమిసంహార మందుల్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు బయటపడింది. దీంతో సంబంధిత డీలర్లపై రెండు 6ఎ కేసులతో పాటు క్రిమినల్ కేసు - మిగతా3లో

## యువతపై జరిగిన హింసకు అమిత్ షానే బాధ్యుడు

- విద్యార్థులకు సంబంధించి ఏం జరిగిందో పార్లమెంటులో వివరించే ధైర్యం ఆయనకు లేదని విమర్శలు
- కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- రాజ్యాంగం కోసం పోరాడి, భారతదేశ భావనను పరిరక్షించిన వేలాది మంది విద్యార్థులను చూసి గర్వంగా ఉంది
- తమ భవిష్యత్తు కోసం, న్యాయమైన పరీక్షా విధానం కోసం విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలపడంలో ఎలాంటి తప్పులేదు






## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లేవ్

- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల కోసం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు లేవు
- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టత- బిల్లులపై రాహుల్ గాంధీతో చర్చలు
- 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

- 142 ఫైర్ ఎన్‌వోసీల్లో 52 నకిలీవే
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసిన ప్రైవేట్ కళాశాలలు
- 142 ఫైర్ ఎన్‌వోసీల్లో 52 నకిలీవేనని గుర్తించిన అధికారులు
- ఆయా కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేసిన హైడ్రా
- జీహెచ్ఎంసీ కమిషనర్ సంతకమూ ఫోర్జరీ



హైదరాబాద్

హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీకి గురైంది. పలు ప్రైవేట్ ఇంటర్ కళాశాలలు అక్రమంగా ఫైర్ ఎన్‌వోసీలు పొందేందుకు ఆయన సంతకం ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. పలువురు ఉన్నతాధికారుల ఫోర్జరీ సంతకాలతోనే ప్రైవేట్ కాలేజీలు ఇంటర్‌బోర్డుకు ఫైర్ ఎన్‌వోసీలు సమర్పించినట్లు వెల్లడైంది. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని మొత్తం 142 ఫైర్ ఎన్‌వోసీల్లో 52 నకిలీవేనని అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆయా కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్ బోర్డుకు - మిగతా3లో

నవగీతం
తెలుగు దినపత్రిక

గురువారం
6 ఆగస్టు 2026

# మౌలిక సదుపాయాలు విస్తరించాయి

2019లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత నుంచి జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ ప్రజల జీవితాల్లో విస్తృతమైన మార్పులు వచ్చాయని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం అన్నారు. ఇరు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణతోపాటు విద్య, వైద్యం, వ్యాపార, క్రీడా రంగాల్లో అవకాశాలు ఎంతో మెరుగయ్యాయని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేసి ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ ప్రాంతాల అభివృద్ధికి, అక్కడ ఉన్న ప్రతి పౌరుడికి పెద్ద కలలు కనే, వాటిని సాధించే, వికసిత్ భారత్ నిర్మాణంతో తమ వంతు సహకారం అందించే అవకాశం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారంటూ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. “ఏడేళ్ల క్రితం ఇదే రోజున, ఆర్టికల్ 370, ఆర్టికల్ 35(ఏ) చరిత్రగా మారిపోయాయి. ఇది జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ ప్రస్థానంలో ఒక నిర్ణయాత్మకమైన కొత్త అధ్యాయాన్ని లిఖించింది. అప్పటి నుంచి జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ ప్రజల జీవితాల్లో విస్తృతమైన మార్పులు వచ్చాయి. మౌలిక సదుపాయాలు విస్తరించాయి. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాపార, క్రీడలు వంటి రంగాల్లో అవకాశాలు పెరిగాయి. భారత రాజ్యాంగం అక్కడ పూర్తిగా అమలు కాకపోవడం వల్ల, దశాబ్దాలుగా ప్రాథమిక రాజ్యాంగ హక్కులకు నోచుకోని మహిళలు, వెనుకబడిన వర్గాల ప్రజలు ఇప్పుడు సాధికారత సాధించారు.”



**కశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు**

2019 ఆగస్టు 5వ తేదీన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్?కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్? 370ని రద్దు చేసింది. ఆ తర్వాత ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్ధాఖ్? అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. ఈ నేపథ్యంలోనే మోదీ తన ఎక్స్? పోస్టులో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. “ఈ సంవత్సరం ఆగస్టు 5వ తేదీకి మరింత ప్రాముఖ్యత ఉంది. ఎందుకంటే ఈ సంవత్సరమే మన దేశం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని జరుపుకుంటోంది. జాతీయ ఐక్యత పట్ల ఆయన జీవితకాల నిబద్ధత తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. దశాబ్దాల క్రితం ఆయన ఊహించినది 2019 ఆగస్టు 5న నెరవేరింది” అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ప్రస్తుతం అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి పూర్వరూపమైన ‘భారతీయ జనసంఘ్?’ వ్యవస్థాపకుడే శ్యామా ప్రసాద్ ముఖర్జీ. ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్మూకశ్మీర్?ను పూర్తిగా భారతదేశంలో విలీనం చేయాలని ఆయన పోరాడారు. 1906 జులై 6న జన్మించిన ఆయన, 1953 జూన్? 23న శ్రీనగర్?లో గృహ నిర్బంధంలో ఉన్న సమయంలో కన్నుమూశారు.

**కశ్మీర్ పురోగమిస్తోంది!**

మరోవైపు జమ్మూకశ్మీర్ ప్రాంతం ప్రస్తుతం పురోగమనంలో ఉందని కేంద్రం చెబుతోంది. శ్రీనగర్ వారసత్వానికి (హెరిటేజ్?) అంతర్జాతీయ గుర్తింపు లభించడం, రికార్డు స్థాయిలో అక్కడకు పర్యటకులు వస్తుండడం, హస్తకళల వృద్ధి ఇందుకు నిదర్శనమని పేర్కొంది. కశ్మీర్ సంస్కృతి, సంప్రదాయాలను, అక్కడి ప్రకృతి అందాలను చూడడానికి ప్రపంచ నలుమూలల నుంచి సందర్శకులు వస్తున్నారని చెబుతోంది. “శ్రీనగర్ యునెస్కో క్రియేటివ్ సిటీ, వరల్డ్ క్రాఫ్ట్ సిటీ అనే ప్రతిష్ఠాత్మక టైటిల్స్‌ను దక్కించుకుంది. ఇది కశ్మీర్ కాలాతీత హస్తకళా నైపుణ్యాన్ని వేడుకగా జరుపుకుంటూ, దాని కళాత్మక వారసత్వాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్తోంది” అంటూ పీఐబీ ఇండియా తన ఎక్స్?లో ఓ పోస్టు పెట్టింది. 2026లో యాభై లక్షల మందికి పైగా భక్తులు వైష్ణోదేవిని సందర్శించారని, 4 లక్షల మందికిపైగా యాత్రికులు అమరనాథ్? యాత్రను పూర్తి చేశారని పేర్కొంది. ఇది ప్రజల్లోని విశ్వాసానికి ప్రతీక అని, ఈ విధంగా జమ్మూకశ్మీర్?లో ఆధ్యాత్మిక పర్యాటకం విలసిల్లుతోందని స్పష్టం చేసింది.

# నిరసనల వేళ పోలీసులు సంయమనం పాటించాలి

జులై 20న జరిగిన ‘మార్చ్ టు పార్లమెంట్’ ఆందోళనల సందర్భంగా తలెత్తిన ఉద్రిక్తతలపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల వేళ పోలీసులు, భద్రతా బలగాలు సంయమనం పాటించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. రాళ్లు విసిరిన యువతపై కఠినంగా వ్యవహరించడం సరికాదని పేర్కొంది. పార్లమెంట్ వైపు దూసుకొచ్చిన వారిపై పోలీసులు తగిన జవాబుదారీతనం ప్రదర్శించలేదని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. ఇలాంటి పరిస్థితులను ఎలా అదుపు చేయాలో పోలీసులకే బాగా తెలుసన్న ధర్మాసనం, శాంతియుత నిరసనలను ప్రోత్సహించాలని, పరిస్థితి చేయిదాటకుండా చూడాలని పేర్కొంది. ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తే సామాజికంగా హింస మరింత పెరుగుతుందన్న ధర్మాసనం, నిరసనకారుల సమస్యలను విని శాంతియుత మార్గాలను ప్రోత్సహించాలని సూచించింది. ఇదే అంశంపై నిర్వాహకులపై చర్యలు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ప్రధాన పిటిషన్‌తో ధర్మాసనం జత చేసింది.

“శాంతియుత ర్యాలీని ప్రోత్సహించడం ముఖ్యం. ఆందోళనల వేళ పోలీసులు, భద్రతా బలగాలు సంయమనం పాటించాలి. రాళ్లు విసిరిన యువతపై కఠినంగా వ్యవహరించవద్దు. యువత హింసకు పాల్పడకుండా ఉండేలా మనం జాగ్రత్తగా వ్యవహరించాలి. కౌన్సెలింగ్ ఇచ్చి శాంతింపజేయడమే ప్రభుత్వాల బాధ్యత. నిరసనకారుల సమస్యను వినడమే బలమైన ఆయుధం. ప్రభుత్వం వైపు నుంచి దూకుడు ప్రదర్శిస్తే సామాజికంగా హింస మరింత పెరుగుతుంది. దారితప్పిన మూకలు రాళ్లు రువ్వినా యువతను శాంతింపజేయడానికే చూడాలి. యువతకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. యువత నిరసనలకు కారణాలను వినడమే అత్యంత శక్తిమంతమైన సాధనం. ప్రభుత్వం నుంచి వచ్చే తీవ్ర ప్రతిస్పందన సమాజంలో మంటలను మరింత పెంచుతుంది. వారి మాటలు వినండి, వారు ఎందుకు నినాదాలు చేస్తున్నారో అర్థం చేసుకోండి. అయితే, ఈ విషయాన్ని చట్టాన్ని అమలు చేసే సంస్థల విచక్షణకే వదిలేద్దాం. ఇలాంటి పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో వారికి మనకంటే బాగా తెలుసు.”

అంతకుముందు నిర్వాహకులపై చర్యలు కోరుతూ మనీష్ కుమార్ సోలంకి దాఖలు చేసిన పిటిషన్?పై ఆయన తరపున న్యాయవాది రిజ్వాన్ అహ్మద్ హాజరై వాదించారు. “15 రోజులు గడిచిపోయాయి. మరి నిర్వాహకుల జవాబుదారీతనం సంగతేంటి? వారు ఒక ఛానల్ నుంచి మరో ఛానల్‌కు వెళ్తూ రెచ్చగొట్టే ప్రకటనలు ఇస్తున్నారు. ఈ ఉద్రిక్తతలను చల్లార్చడానికి నిరాకరిస్తున్నారు. నిన్న రాజస్థాన్‌లో రాళ్ల దాడి జరిగింది. ఇది చాలా ప్రమాదకరమైన సంప్రదాయానికి దారితీస్తుంది. రాజస్థాన్?లో జరిగిన నిరసనల్లో ఒక యువకుడు మరణించాడు. జాతీయ రాజధానికి సంబంధించిన విషయంలో ప్రభుత్వం అతిగా వెనక్కి తగ్గితే, అది రాజస్థాన్‌లో ఒక ఉదాహరణగా నిలవదా? అక్కడ కూడా విద్యార్థులకు అనుకూలంగా ప్రభుత్వం వెనక్కి తగ్గుతోంది. లఖ్?నవూలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏదైనా డిమాండ్‌తో బస్సులపై రాళ్లు రువ్వడం ప్రారంభిస్తే, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం కూడా వెనక్కి తగ్గుతుందా?” అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తప్పుడు వైఖరి అనుసరించిందన్న ఏకైక కారణంతో, రాళ్లు రువ్విన వారిని ఎలాంటి పరిశీలన లేకుండా శిక్ష నుంచి తప్పించకూడదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. “ఇది చాలా ప్రమాదకరమైన ఆనవాయితీ. మూడేళ్ల క్రితం రైతులు సింఘూ సరిహద్దు వద్ద ఇలానే చేశారు. రేపు ఆల్ఫా, బీటా, గామా, డెల్టా తరాల వారు వస్తారు. సింఘూ సరిహద్దులోని ప్రజలు ట్రాక్టర్లతో పార్లమెంటుకు వస్తారు. అక్కడ అనుమతి లేదు, పైగా నిర్వాహకులు 22 షరతులను ఉల్లంఘించారు. ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంటు వైపు నిరసనకారులు ర్యాలీగా వెళ్లడం సరికాదు. ఒకవేళ 500 మంది పార్లమెంటులోకి ప్రవేశించి ఉంటే, వారి వద్ద నాటు తుపాకులు లేదా నాటు బాంబులు లేవని ఎవరికి తెలుసు? ఒకవేళ వారు కాల్పులు జరిపి ఉంటే పరిస్థితి ఏమయ్యేది? వారు జాతీయ రహదారిపై, రైల్వే లైన్?పై ర్యాలీ చేయలేదు. వారు ప్రజాస్వామ్య దేవాలయం వైపు ర్యాలీగా వెళ్లారు. దీనికి అందరూ బాధ్యత వహించాలి.” అని న్యాయవాది అన్నారు.



నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ జూలై 20న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ‘సంసద్ మార్చ్’ను చేపట్టింది. మార్చ్ సందర్భంగా రాళ్ల దాడి ఘటనలు జరగడంతో పోలీసులు ప్రతిచర్యలకు దిగారు. ఈ క్రమంలోనే పలువురు నిరసనకారులు, భద్రతా సిబ్బంది గాయపడ్డారు.

# జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ భారత్‌లో అంతర్భాగమే

జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆగస్టు 5వ తేదీని దోపిడీ దినోత్సవంగా పాటించేందుకు పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నాన్ని? భారత్? తీవ్రంగా ఖండించింది. ఇది ముమ్మాటికి భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు పాక్? చేస్తున్న దుష్ప్రచారమేనని విదేశాంగ శాఖ పేర్కొంది. ఇలాంటి ప్రయత్నాలతో అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని పాక్? యత్నిస్తోందని మండిపడింది. అయితే, భారత్‌పై ఆరోపణలు చేయడం కంటే ముందుగా పీఓకేలో జరుగుతున్న రక్తపాతాన్ని ఆపాలని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్?ధీర్ జైస్వాల్ సూచించారు. అలాగే పాక్? భూభాగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఉగ్రవాద సంస్థలపై శాశ్వత చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా, అక్రమణలో ఉన్న భారత భూభాగాలన్నింటినీ తక్షణమే ఖాళీ చేయాలని వ్యాఖ్యానించారు.

మీడియాతో బుధవారం మాట్లాడిన జైస్వాల్, పాకిస్థాన్?కు చురకలంటించారు. జమ్మూకశ్మీర్, లద్ధాఖ్? కేంద్ర పాలిత ప్రాంతాలు భారత్‌లో అంతర్భాగమేనని ఉద్ఘాటించారు. గతంలోనూ అవి భారత్‌లో భాగమేనని, భవిష్యత్తులో కూడా అలాగే కొనసాగుతాయని నొక్కి చెప్పారు. భారత ప్రభుత్వం 2019 ఆగస్టు 5న, జమ్మూకశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక హోదాను రద్దు చేసి, ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లడఖ్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఆగస్టు 5ను ‘యౌమ్-ఎ-ఇస్తేహ్సాల్’గా పాకిస్థాన్ పాటిస్తూ వస్తోంది. అలాగే, ఏడేళ్ల క్రితం దిల్లీ తీసుకున్న చర్య దక్షిణాసియాలో శాంతి, స్థిరత్వాలను నెలకొల్పే ప్రయత్నాలను క్లిష్టతరం చేసిందని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వ్యాఖ్యానించారు. అందుకు బదులుగా రణ్‌ధీర్ జైస్వాల్ ఘాటుగా స్పందిస్తూ, పాక్? చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని, వాటిని భారత్ పూర్తిగా తిరస్కరిస్తోందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన 2019లో చేసిన రాజ్యాంగపరమైన మార్పులు పూర్తిగా భారత అంతర్గత వ్యవహారమని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో వ్యాఖ్యానించే అర్హత పాక్?కు లేదని గట్టిగా చెప్పారు. అయితే భారత ప్రభుత్వ నిర్ణయాల వల్ల అక్కడ ప్రజలకు గతంతో పోలిస్తే మెరుగైన పరిపాలన, సామాజిక, ఆర్థిక అభివృద్ధిని, సుపరిపాలనను, ప్రజాస్వామ్య సాధికారతను అందించాయని తెలిపారు.



ప్రజలపై పాక్ అణచివేత

పాకిస్థాన్ తన దేశంలోని ‘ప్రస్తుత పరిస్థితిని, మానవ హక్కుల రికార్డును, ప్రపంచ ఉగ్రవాద కేంద్రంగా తనకున్న స్థితి’ నుంచి ప్రపంచం దృష్టిని మళ్లించేందుకు భారత్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తోందని రణ్?ధీర్? జైస్వాల్? పేర్కొన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఇటీవల నిరసనకారులపై పాకిస్థాన్ జరిపిన చర్యను ఆయన ప్రస్తావించారు. పీఓకేలో శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలపై పాక్? బలగాలు తీవ్ర అణచివేతకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. నిరసనకారులను అణిచివేయడానికి వారిపై కాల్పులు జరపడం, కఠిన ఆంక్షలు విధించడం వంటి చర్యలు అక్కడి వాస్తవ పరిస్థితిని అంతర్జాతీయ సమాజం చూస్తోందని తెలిపారు.

కాగా, జూన్ నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో నిరసనలపై పాక్? దళాలు జరిపిన అణచివేతలో కనీసం 90 మంది ప్రాణాలు కోల్పోయారని, సాధారణ పౌరులపై ప్రభుత్వ బలగాలు హింసకు పాల్పడటం పాకిస్థాన్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని జైస్వాల్? పేర్కొన్నారు. అంతకుముందు కూడా పీఓకే పౌరులపై పాక్ ప్రభుత్వం అరాచకంగా వ్యవహరిస్తోందని భారత్ మండిపడింది. అంతర్జాతీయ సమాజం దీన్ని గమనించి పాక్‌ను జవాబుదారీ చేయాలని పిలుపునిచ్చింది. పీవోకేలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జులై 27 నుంచి జరుగుతున్న సైన్యం దాడుల్లో 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని ఇటీవల దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రణధీర్ జైస్వాల్? పేర్కొన్నారు. పీవోకేలోని ప్రజలను పాక్ రక్షణశాఖ మంత్రి శత్రువులుగా అభివర్ణించారని, ఆ తర్వాతే వారిపై సైన్యం దాడుల్ని తీవ్రం చేసిందని వ్యాఖ్యానించారు.


## యువతపై జరిగిన హింసకు అమిత్ షానే బాధ్యుడు

కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. నిరసన చేస్తున్న యువతపై జరిగిన హింసకు అమిత్ షానే బాధ్యుడని దుయ్యబట్టారు. విద్యార్థులకు సంబంధించి ఏం జరిగిందో పార్లమెంటులో వివరించే ధైర్యం ఆయనకు లేదని విమర్శించారు. పేపర్ లీకేజీల సమస్యపై నిరసన తెలిపిన విద్యార్థులను కలిసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. రాజ్యాంగం కోసం పోరాడి, భారతదేశ భావనను పరిరక్షించిన వేలాది మంది విద్యార్థులను చూసి గర్వంగా ఉందన్నారు. తమ భవిష్యత్తు కోసం, న్యాయమైన పరీక్షా విధానం కోసం విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలపడంలో ఎలాంటి తప్పులేదని, విద్యా వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించడం నేరం కాదన్న రాహుల్, దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తీవ్రంగా స్పందించారు.

“యువ నిరసనకారులతో మేము స్వేచ్ఛగా మాట్లాడాం. తమపై దాడి చేశారని, కొట్టారని, బెదిరించారని వారు నాతో చెప్పారు. నాకు వారిని చూసి చాలా గర్వంగా ఉంది. వారు చేసిన పనికి, అలాగే వారిలాగే వేలాది మంది యువ భారతీయులు చేసిన పనికి నేను చాలా గర్విస్తున్నాను. వారు రాజ్యాంగాన్ని కాపాడారు, ‘భారతదేశం’ అనే భావనను రక్షించారు, భారతదేశ భవిష్యత్తును కాపాడారు. లోపభూయిష్టంగా, కుప్పకూలే స్థితిలో, నిరుపయోగంగా ఉన్న విద్యావ్యవస్థపై ఫిర్యాదు చేయడం ఏమాత్రం నేరం కాదు. ఒకవేళ ఏమైనా చేయాల్సి ఉంటే, ఆ వ్యవస్థను మార్చాలి, సరిదిద్దాలి. వారు కోరింది కూడా సరిగ్గా అదే. వారు ఎలాంటి హింసకూ పాల్పడలేదు, దూకుడుగా ప్రవర్తించలేదు, అసభ్యంగా నడుచుకోలేదు. కానీ వారిపై దాడి చేశారు, కొట్టారు, బెదిరించారు. మహిళల ఇళ్లకు గుండాలను పంపడం, 15 ఏళ్ల చిన్నారిని బలవంతం చేసి క్షమాపణలు చెప్పించడం, ఆపై ఆ క్షమాపణను అంగీకరించడం పక్కా మూర్ఖత్వం. దాన్ని మేము అంగీకరించం. సరిగ్గా పనిచేసే విద్యావ్యవస్థ మాకు కావాలి. ప్రశ్నాపత్రాల లీకేజీలు ఆగాలి. ఈ దేశ భవిష్యత్తు అయిన ఈ యువతను గౌరవించాలి, రక్షించాలి. మీ అందరినీ చూసి నేను ఎంతగానో గర్విస్తున్నాను. ఈ పని చేసిన ప్రతి ఒక్క యువకుడిని చూసి గర్విస్తున్నాను. మీరు ఎలాంటి తప్పూ చేయలేదు. ఇక మీరు క్షమాపణ చెప్పాలనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. మీరు ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదు, ఎందుకంటే మీరు ఏ తప్పూ చేయలేదు.”

“యువతిపై పెల్లెట్ గన్‌తో కాల్పులు జరిపిన వ్యక్తి. కొన్ని రోజుల క్రితం నేను మీడియా ముందు ఉంచిన యువకుడిపై పెల్లెట్ గన్‌తో కాల్పులు జరిపిన వ్యక్తి. అలాగే ఈ యువతికి వ్యతిరేకంగా పోలీసు యంత్రాంగాన్ని ఉసిగొల్పిన వ్యక్తి అమిత్ షానే. ఆయనే భారతదేశ హోం మంత్రి. ఆయన (షా) పార్లమెంటుకు రావాల్సిన కనీస మర్యాద కూడా పాటించడం లేదు. జరిగిన ఘటనపై స్పందించే కనీస మర్యాద, ధైర్యం ఆయనకు లేవు. ఇందులో రెండు అవకాశాలు ఉన్నాయి: ఒకటి, పిల్లలపై హింస జరిగిందన్న విషయం ఆయనకు తెలియకపోవచ్చు. అలా అయితే ఆయన అసమర్థుడు అనుకోవాలి. రెండోది యువతపై పెల్లెట్ గన్ కాల్పులు జరపాలని, హింసను ప్రేరేపించాలని ఆయనే ఆదేశించి ఉండవచ్చు. అలా అయితే ఆయన బాధ్యుడు (నేరస్థుడు) అవుతారు. ఏది ఏమైనప్పటికీ, దీనికి ఆయనే బాధ్యుడు.” అని రాహుల్ గాంధీ అన్నారు. సమర్థంగా పనిచేసే విద్యా వ్యవస్థ ఉండాలని, పరీక్షా పత్రాల లీకేజీలు ఆగిపోవాలని, అలాగే భవిష్యత్తును గౌరవించి కాపాడాలని గాంధీ పిలుపునిచ్చారు.

## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లేవ్






పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారంటూ వస్తున్న వార్తలకు కేంద్ర ప్రభుత్వం తెరదించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై (నియోజకవర్గాల పునర్విభజన) చర్చించేందుకు ఆగస్ట్ 16- 18 తేదీల్లో స్పెషల్ సెషన్ నిర్వహించనున్నారనే ప్రచారాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. అలాంటి ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని ఆయన బుధవారం రాత్రి స్పష్టం చేశారు. అదే విధంగా ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలను పొడిగించే అవకాశాలు కూడా లేవని రిజిజు వెల్లడించారు. ప్రస్తుత పార్లమెంట్ మాన్సూన్ సెషన్ జులై 20 నుంచి ఆగస్ట్ 13 వరకు కొనసాగనుంది. ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఆగస్ట్ 13నే ఇవి ముగియనున్నాయని రిజిజు వెల్లడించారు. ఈ సమావేశాల్లో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లును, అలాగే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన డీలిమిటేషన్ బిల్లులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే రిజిజు దీనిపై క్లారిటీ ఇచ్చారు.

**ప్రతిపక్షాలతో సంప్రదింపులు**

బిల్లుల ఆమోదం కోసం ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్‌తో పాటు ఎన్డీఏ మిత్రపక్షాలతో ప్రభుత్వం సంప్రదింపులు ప్రారంభించింది. ఈ క్రమంలోనే కిరణ్ రిజిజు బుధవారం రోజు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కలిశారు. ఇక్కడ రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రాతో వారి ఛాంబర్‌లో దాదాపు 50 నిమిషాల పాటు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు రిజిజు ప్రయత్నించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కానీ ఈ అంశంపై కాంగ్రెస్ నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ లభించలేదని సమాచారం. ప్రభుత్వం ఇదే అంశంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, డీఎంకే నాయకత్వంతో కూడా చర్చలు జరపాలని భావిస్తోంది. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును తిరిగి ప్రవేశపెట్టే అవకాశాలపై పార్టీల అభిప్రాయాల్ని తెలుసుకోవాలని చూస్తోంది.

**డీలిమిటేషన్‌తో పెరగనున్న లోక్‌సభ స్థానాలు**

2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. అలాగే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత లోక్‌సభ స్థానాల సంఖ్య 816 కి పెరిగే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. గతంలో కూడా ఈ బిల్లుల ఆమోదం కోసం కేంద్రం ప్రయత్నాలు చేసినప్పటికీ అప్పట్లో తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో ముందుకు సాగలేదు. ప్రస్తుతం ప్రతిపక్షాలతో చర్చల ద్వారా బిల్లుల ఆమోదానికి ప్రభుత్వం మార్గం సుగమం చేసుకోవాలని చూస్తోంది.

ఇదిలా ఉండగా, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు- 2026 ను (ఖీజ=ూ) ఆమోదింపజేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లు విదేశీ నిధులు స్వీకరించే సంస్థల పర్యవేక్షణ, ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రద్దయిన సంస్థల ఆస్తుల నిర్వహణకు కొత్త విధానాల్ని ప్రతిపాదిస్తోంది. రిజిస్ట్రేషన్ రద్దైన సంస్థల విదేశీ నిధులు, ఆస్తుల్ని పర్యవేక్షించేందుకు ఒక డిజిగ్నేటెడ్ అథారిటీని ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. సదరు సంస్థలు నిర్ణీత వ్యవధిలో నిబంధనలు పాటించి రిజిస్ట్రేషన్ పునరుద్ధరించుకుంటే ఆస్తులు వెనక్కి వస్తాయి. లేదంటే ఆ ఆస్తులు పూర్తిగా అథారిటీ పరిధిలోకి వెళ్తాయి. ఉల్లంఘనలకు సంబంధించి విధించే గరిష్ఠ జైలు శిక్షను ఐదేళ్ల నుంచి ఒక సంవత్సరానికి తగ్గించడం, దర్యాప్తు సంస్థలు ముందస్తు అనుమతి తీసుకోవడం వంటి మార్పుల్ని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. మార్చి 25న ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా ఇప్పుడు దీనిని ఆమోదింపజేసుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగియడానికి ఇంకా కొన్ని రోజుల సమయం ఉండటంతో ప్రత్యేక సెషన్ అవసరం లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ప్రతిపక్షాల నిరసనల కారణంగా పార్లమెంట్ కార్యకలాపాలు తరచుగా వాయిదా పడుతూనే ఉన్నాయి. బిల్లులు చర్చ లేకుండానే ఆమోదం పొందుతున్నాయన్న విమర్శలకు ప్రతిస్పందించిన కిరణ్ రిజిజు, ఇందుకు ప్రతిపక్షాలే కారణమని ఆరోపించారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
6 ఆగస్టు 2026

## పాతబస్తీకి మణిహారంలా స్టీలు బ్రిడ్జి నిర్మాణం

# త్వరలోనే అందుబాటులోకి రానున్న పైవంతెన

పాతబస్తీకి మణిహారంలా మరో పైవంతెన అందుబాటులోకి రానుంది. కొత్తగా చంచల్‌గూడ జైలు నుంచి ఒవైసీ ఆస్పత్రి కూడళ్ల మధ్య స్టీలు బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం దీనికి తుది మెరుగులు చేస్తున్నారు. ఇప్పటికే అక్కడ జూపార్క్‌-ఆరాంఘర్ చౌరస్తా, మిథాని, చాంద్రాయణగుట్ట కూడళ్లపై పైవంతెనలు అందుబాటులోకి వచ్చాయి. కొత్త స్టీలు బ్రిడ్జి ఆగస్టు రెండో వారంలో ప్రారంభోత్సవం ఉంటుందని జీహెచ్‌ఎంసీ ముఖ్య ఇంజినీరు సహదేవ్ రత్నాకర్ పేర్కొన్నారు.



**రోజూ లక్షన్నర వాహనాల ప్రయోజనం**

ఈ పైవంతెన ద్వారా బడంగ్‌పేట్, ఆదిభట్ల నుంచి ఎంజీబీఎస్, ప్రధాన నగరంలోని ఇతర ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే వారికి సులభతరం కానుంది. వాహనదారులకు కనీసం 20 నిమిషాల సమయం ఆదా అవుతుందని జీహెచ్‌ఎంసీ ముఖ్య ఇంజినీరు తెలిపారు. దీని ద్వారా రోజూ లక్షన్నర వాహనాలు ప్రయోజనం పొందనున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం పైవంతెనకు సంబంధించిన రంగులు, వీధిలైట్లు, చివరి దశలోని ర్యాంపు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామన్నారు. అలాగే పెట్రోల్ వాడకం, వాతావరణ కాలుష్యం, వాహనదారుల్లో నెలకొనే ఆందోళన తగ్గనున్నాయని ఆయన వివరించారు.

**తక్కువ భూసేకరణతో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం**

సాధారణంగా చంపాపేట్, ఒవైసీ ఆస్పత్రి వద్దనున్న ఇన్నర్ రింగు రోడ్డుకు చేరుకోవాలంటే నల్గొండ క్రాస్ రోడ్డు వంతెన దిగి 3 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఈ మధ్యలో 5 కూడళ్లు ఉంటాయి. అయితే మాస్టర్? ప్లాన్? ప్రకారం రహదారిని వందడుగుల మేర విస్తరించాలి. కానీ మత విశ్వాసాలతో ముడిపడిన నిర్మాణాలు, పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లు, వ్యాపార కేంద్రాలున్నాయి. అన్నింటినీ దృష్టిలో పెట్టుకుని తక్కువ భూసేకరణతో స్టీల్ బ్రిడ్జిని నిర్మించారు.

సిగ్నల్ ఫ్రీ స్టీల్ బ్రిడ్జ్

ఈ పైవంతెన ద్వారా 30 నిమిషాల ప్రయాణ గమ్యాన్ని కేవలం 5 నిమిషాలకు తగ్గించారు. రహదారి మొత్తంలో ఎలాంటి సిగ్నల్? లేకుండా తీర్చిదిద్దుతున్నారు. మధ్యలో డౌన్? ర్యాంపు, అప్? ర్యాంపును నిర్మించారు. అంటే సైదాబాద్ కూడలిలో చంచల్‌గూడ నుంచి చంపాపేట్ వైపు వెళ్లే వాహనాల కోసం ఓ డౌన్? ర్యాంప్? నిర్మించారు. సైదాబాద్ నుంచి కూడలిలో పైవంతెన ఎక్కి చంచల్‌గూడ వైపు వెళ్లేందుకు మరో అప్ ర్యాంపును నిర్మించింది. మొత్తం పైవంతెన పొడవు 2.58 కిలోమీటర్లు, వెడల్పు నాలుగు లేన్లు ఉంటుంది. అధ్యయనం ప్రకారం 2015లో సంతోష్‌నగర్–సైదాబాద్ రహదారిపై ఒక రోజుకు 70,576 ప్రయాణించేవి. ప్రస్తుతం 1,50,000 వాహనాలు వెళ్తున్నాయి. 2035 నాటికి ఆ సంఖ్య 1,93,632 కానుంది. ప్రాజెక్ట్? వ్యయం విషయానికొస్తే మొత్తం రూ. 620 కోట్లు ఖర్చు చేశారు. అందులో నిర్మాణ వ్యయం రూ. 466.63 కోట్లు కాగా భూసేకరణ వ్యయం 153.37 కోట్లు అయ్యాయి.

## ఇన్స్యూరెన్స్ చేయరు, పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండదు

# ఇష్టారాజ్యంగా కాంట్రాక్ట్ క్యారేజ్‌ల తీరు

హైదరాబాద్ నగరంలో కాంట్రాక్ట్ క్యారేజ్ వాహనాలకు ఇన్సూరెన్స్ ఉండదు, పీయూసీ(పొల్యూషన్ అండర్ కంట్రోల్) సర్టిఫికెట్ తీసుకోరు. చివరికి పర్మిట్ కూడా లేకుండానే రోడ్లెక్కుతున్నాయి. ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో ఇన్సూరెన్స్ చేయని వాహనాలే ఎక్కువగా ఉంటున్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో స్థానంలో పీయూసీ లేనివి, పర్మిట్ లేనివి ఉన్నాయి. మధ్యలో ఎవరినీ ఎక్కించుకోకుండా ప్రయాణికులను ఒకచోటు నుంచి మరో చోటుకు చేరవేసే ఈ కాంట్రాక్ట్ క్యారేజ్‌లకు పర్మిట్ లేకపోవడంతో ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 116 కేసులను సంబంధిత అధికారులు నమోదు చేశారు.



టూరిస్టు బస్సులు, వ్యాన్లు, నగరం నుంచి దూరప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు బస్సులు కూడా కాంట్రాక్ట్ క్యారేజ్?ల విభాగంలోకే వస్తాయి. ప్రైవేటు బస్సులు పేరుకు కాంట్రాక్ట్ క్యారేజ్‌లు అయినప్పటికీ అవి నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆపుతూ ప్రయాణికులను ఎక్కించుకుంటున్నాయి. అధికశాతం ఆటోలు ఈ విభాగంలోనే ఉన్నాయి. రాత్రి 10 తర్వాతే ట్రావెల్స్ బస్సులు రోడ్లపైకి రావాలని ట్రాఫిక్ అధికారులు సూచించినప్పటికీ 9 గంటల నుంచే రహదారులపైకి రావడంతో పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**బీమా చేయడం తప్పనిసరి**

ఇన్సూరెన్స్ లేని వాహనం ప్రమాదానికి గురై ఇతరులకు నష్టం కలిగించినట్లయితే సంబంధిత వాహన యజమానే బాధితుడికి పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. అందుకే చాలామంది థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌తో సరిపెడుతున్నారు. కొందరు అవీ తీసుకోవడం లేదు. నిత్యం తిరిగే ట్రావెల్స్ బస్సులకు బీమా చేస్తారు. ఆటోలు, ఇతర చిన్న వాహనాలు, స్థానికంగా తిరిగే వాహనదారులు అదో అదనపు భారంగా భావిస్తుంటారు. ఇన్సూరెన్స్ తప్పక చేయించుకోవాలి. అది వాహన యజమాని, డ్రైవర్‌ను ఆదుకునే రక్షాపత్రం అని చెప్పవచ్చు.

గత 7 నెలల్లో వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేకపోతే రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు ఒక్కో జోన్ పరిధిలో సగటున సుమారు 375 చొప్పున కేసులు నమోదయ్యాయి. ఇతర నిబంధనల ఉల్లంఘన కింద ఒక్కో జోన్‌లో 150కి పైగానే కేసులు నమోదయ్యాయి.

**నిబంధనలు గాలికి వదిలి**

రోడ్డుభద్రతా నిబంధనలు పాటించకపోవడం కారణంగా ఏటా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్టీఏ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నా కాంట్రాక్ట్ క్యారేజ్? వాహనాల నిర్వహకుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావట్లేదు. యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. వాహనాలు ఇష్టానుసారంగా నిలపడం కారణంగా ఓవైపు ట్రాఫిక్ ఇబ్బందులు, మరోవైపు ఆర్టీసీ ఆదాయానికి కూడా భారీగా గండిపడుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బస్టాండ్ పరిధిలో రెండు కిలోమీటర్ల వరకు ఎలాంటి ప్రైవేట్ వాహనాలను నిలపడం, ప్రయాణికులను ఎక్కించుకోవడం లాంటివి చేయకూడదు. నిబంధనలకు విరుద్ధంగా ఆర్టీసీ బస్టాండ్?కు ఎదురుగానే ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. అధికారులు దృష్టిసారించి తనిఖీలు ముమ్మరం చేసి అలాంటి వాహనాలు రోడ్డుపైకి రాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ముడుపుల లెక్కచెప్పే..

## నీతిమాటలు

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటి వరకు ట్రైబ్యునల్ ఏర్పడకుండా సమయస్ఫూర్తితో అడ్డుకున్నాం. సమ్మక్క సాగర్ విషయంలో ఛత్తీస్‌గఢ్‌తో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంప్రదింపులు జరపలేదు. ఆ రాష్ట్రం నుంచి ఎన్‌వోసీ కోసం మేం ప్రయత్నిస్తున్నాం.. నెలాఖరులో ఇస్తామన్నారు. ఏపీ అభ్యంతరాలను తిప్పికొట్టి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అనుమతులు సాధించాం. పోలవరం-బనకచర్ల ప్రతిపాదనపైనా వెంటనే స్పందించాం. నీటి హక్కులను పరిరక్షించేందుకు మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. కాళేశ్వరం నిర్మాణంలో ఏపీ కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు అందాయి. ఈ విషయంలో కవిత చేసిన ఆరోపణలకు హరీశ్‌రావు జవాబు చెప్పాలి. ఏపీ కాంట్రాక్టర్ల నుంచి అందిన ముడుపుల్లో ఆయన వాటా ఎంత?" అని ఉత్తమ్ ప్రశ్నించారు

పోలవరం, పట్టిసీమ, రాయలసీమ ఎత్తిపోతలపై బీఆర్‌ఎస్ ఎందుకు మౌనం పాటించిందని 12 ఏళ్లుగా ప్రతి +=వీదీ సమావేశంలో ఏపీ ఇదే అభ్యంతరాలు చెబుతోందని ఇందులో కొత్తేం లేదన్నారు

ఏపీ అభ్యంతరాలను తిప్పికొట్టి సీతమ్మసాగర్--సీతారామకు ూాజ అనుమతి తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని 67 టీఎంసీల నీటి కేటాయింపులు సాధించిందన్నారు. ట్రిబ్యునల్ ఏర్పాటును సమయస్ఫూర్తితో అడ్డుకున్నామని సమ్మక్క సాగర్ చీూజ కోసం ఛత్తీస్‌గఢ్ సీఎంను మూడుసార్లు కలిశాం... నెలాఖరులో చీూజ వస్తుందని తెలిపారు.

## మోదీ, అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి.. బీవీ రాఘవులు

హైదరాబాద్: సీజేపీ, ఇతర యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన చలో పార్లమెంట్ సందర్భంగా జెన్‌జీపై లాఠీలు ఝులిపించడం, పిల్లెట్లను ప్రయోగించడం దారుణమనీ సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ. రాఘవులు అన్నారు. ఈ విషయంలో యువతకు, దేశ ప్రజలకు ప్రధాన మంత్రి మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల మీద చర్చించేందుకు కాకుండా ప్రతిపక్ష పార్టీల ఎంపీలను చీల్చి గత సమావేశాల్లో వీగిపోయిన బిల్లులను ఆమోదించుకోవడానికి పార్లమెంట్ సమావేశాలు పెట్టినట్టు ఉందని విమర్శించారు. చలో పార్లమెంట్ సందర్భంగా జరిగిన ఘటనలపైనా, విద్యార్థులపై జరిగిన దాడులపైనా కనీసం చర్చించేందుకు అధికార ఎన్‌డీఏ కూటమి ముందుకు రాకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై దాడులకు పాల్పడింది ఎవరు? పెల్లెట్లు ప్రయోగించాల్సిన అవసరమేమి వచ్చింది? ఆ ఘటనకు ఆదేశాలు జారీ చేసిందెవరు? అనే దానిపై చర్చే లేదన్నారు. పార్లమెంట్ సమావేశాలకు రాకుండా అమిత్‌షా మొహం చాటేయడాన్ని తప్పుబట్టారు. జెన్‌జీ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులను క్షమిస్తున్నామని ప్రధాని మోదీ ప్రకటన చేయడం అంటే విద్యార్థుల పోరాటాన్ని అవమానించడమేనని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ మహిళా బిల్లును కలిపి పెట్టినందుకే ప్రతిపక్షాలు వ్యతిరేకించాయన్నారు. కేవలం మహిళా బిల్లునే విడిగా ప్రవేశపెట్టేందుకు ముందుకు వస్తే అన్ని పక్షాలు మద్దతు తెలుపుతాయని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు పదో తేదీన తలపెట్టిన జైల్‌భరోకు మద్దతిస్తున్నామనీ, ఆ నిరసనల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. బిహార్ ఉప ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ గెలుపు బీజేపీకి చెంపపెట్టు అన్నారు. దేశంలోని యువతరం బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తున్నదనీ, మతం, రాముని పేరుతో రాజకీయాలు ఎల్లకాలం సాగవని తెలిపారు. జెన్‌జీ పోరాటం రాజకీయంగా వినూత్న మార్పునకు సంకేతమనీ, ఇది లౌకిక శక్తులకు పెద్ద ఊరట అని కొనియాడారు. ప్రధాని మోదీ మెప్పు కోసం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విలపించినట్టు ఉందని విమర్శించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వల్ల 20 మంది విద్యార్థులు చనిపోయినప్పుడు, లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు బాధపడ్డప్పుడు ఎందుకు ఏడుపు రాలేదని ప్రశ్నించారు.

**ఇండ్ల స్థలాల కోసం పోరాటాలు : జాన్‌వెస్లీ**

ప్రజలకు విద్యావైద్యాన్ని ఉచితంగా అందించేలా పాలకులపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు పోరాటాలు చేస్తున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. విద్యావైద్య రంగాలను పరిరక్షించడంలో భాగంగా వాటిని ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 85 శాతం మంది పిల్లలను తల్లిదండ్రులు ప్రయివేటు స్కూళ్లలో చదివిస్తున్నారనీ, కొత్త ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయకపోవడమే కారణమని తెలిపారు. తక్కువలో తక్కువగా ఏటా ఒక్కో విద్యార్థిపై తల్లిదండ్రులు రూ.50 వేల వరకు ఖర్చుపెట్టాల్సి రావడం భారంగా మారిందని చెప్పారు రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ కోసం ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, టీచర్లను నియమించకుండా నియోజకవర్గానికి ఒకటో, రెండో స్కూళ్లను పెడతామని చెప్పడమంటే ప్రభుత్వ విద్యావ్యవస్థను నీరుగార్చడమేనని విమర్శించారు. తక్షణమే రాష్ట్రంలో ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ కోసం నిరుద్యోగ యువత చేస్తున్న పోరాటాలకు తమ పార్టీ అండగా ఉంటుందని హామీనిచ్చారు.

## త్వరగా సమావేశం ఏర్పాటు చేయండి

-మొదటిపేజీ తరువాయి

పెద్దగా తేడా రాదని జల్‌శక్తి మంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. తుమ్మిడిహెట్టి అంశంపై మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహెట్టి ప్రాధాన్యత, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్‌శక్తికి పంపిన లేఖ విషయాన్ని రేవంత్‌రెడ్డి ఆ శాఖ మంత్రితో ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు.

తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం నిర్వహించిందని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా ముంపులో పెద్దగా తేడా ఉండదని సీడబ్ల్యూపీఆర్‌ఎస్? అధ్యయనం స్పష్టం చేసినట్లు తెలిపారు. ముంపులో కూడా 50 శాతం నదీ గర్భంలోనే ఉంటుందని కేంద్ర మంత్రి పాటిల్‌కు వివరించారు. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారా కావల్సినంత నీరు సరఫరా చేయలేమని, దానిని 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రి పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

**త్వరగా సమావేశం ఏర్పాటు చేయండి**

తుమ్మిడిహెట్టి వద్ద 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారానే నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని కేంద్ర మంత్రికి రేవంత్ రెడ్డి తెలియజేశారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరాతో విద్యుత్ వినియోగం భారం ఉండదన్న సీఎం, బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే పూర్తిగా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు నీటి వసతి ఏర్పడుతుందని వివరించారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందిందని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ సీఎం రేవంత్ రెడ్డికి తెలిపారు. ఈ అంశంపై మొదట కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ, మహారాష్ట్ర స్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని, ఆ తర్వాత తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తానని సీఆర్ పాటిల్ రేవంత్ రెడ్డికి తెలిపారు.

**ఆ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులివ్వండి**

అనంతరం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు-రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని విన్నవించారు. కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పార్లమెంట్‌లో కలిశారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతలపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్‌పై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్ల నిధులను వ్యయం చేసిందని కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌కు సీఎం వివరించారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

-మొదటిపేజీ తరువాయి

అధికారులు మంగళవారం ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక నిరభ్యంతర ధ్రువపత్రాల కోసం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు కీలక అధికారుల సంతకాలను కూడా పలు కాలేజీ యాజమాన్యాలు ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. గతంలో అగ్నిమాపక శాఖలో పనిచేసి బదిలీ అయిన ఉన్నతాధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ సంతకాలు కూడా ఫోర్జరీ జరిగినట్టు తేల్చారు. అయితే ఈ వ్యవహారంలో సూత్రధారులెవరు పాత్రదారులెవరు అనే కోణంలో పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో 142 జూనియర్ కళాశాలలు ఫైర్ ఎన్‌వోసీలు సమర్పించాయి. అందులో 90 వరకు ఒరిజనల్?వి ఉండగా 52 ధ్రువపత్రాలు నకిలీవేనని తేలింది. వీటిని సమర్పించిన వారిపై తదుపరి చర్యలకు ఉద్దేశించి జులై 4న నెక్లెస్ రోడ్డులోని లేక్ పోలీసు స్టేషన్లో కేసు కూడా హైడ్రా నమోదు చేసింది. 2025-26, 2026-27 విద్యా సంవత్సరాలకు సంబంధించి జూనియర్ కళాశాలల యాజమాన్యాలు సమర్పించిన ఫైర్ ఎన్‌వోసీల ప్రతులన్నిటినీ హైడ్రా నిశితంగా పరిశీలించగా ఈ విషయం వెల్లడైంది.

**సింహభాగం నకిలీ ధ్రువపత్రాలే**

మొదటి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు (డీఐఈవో) మొత్తం 76 ఫైర్ ఎన్‌వోసీలను ప్రామాణికత నిర్ధారణ కోసం పంపించారు. వాటిని హైడ్రా కార్యాలయ రికార్డులతో పరిశీలించగా, 7 ఫైర్ ఎన్‌వోసీలు నకిలీవని తేలింది. రెండో దశలో సంబంధిత జిల్లా డీఐఈవోలు మొత్తం 66 ఫైర్ ఎన్‌వోసీలను ధ్రువీకరణ కోసం పంపించారు. వీటిని కూడా హైడ్రా కార్యాలయ రికార్డులతో పరిశీలించగా, 45 ఫైర్ ఎన్‌వోసీలు నకిలివేనని తేలింది. ఈ మేరకు ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డుకు హైడ్రా సూచించింది.

ఫోర్జరీ ఎన్‌వోసీలు పొందిన పలు కాలేజీలివే

హైదరాబాద్‌లో కీలక ప్రాంతాల్లోని పలు ప్రైవేట్ ఇంటర్ కాలేజీలు ఫైర్ ఎన్‌వోసీల కోసం ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. తొలి విడత తనిఖీల్లో మెహిదీపట్నంలో ప్రియాంక ఇంటర్మీడియట్ కాలేజీ, విద్యానగర్‌లోని మదర్స్ గర్ల్స్, చాంద్రాయణగుట్టలోని శ్రీచంద్ర, చిక్కడపల్లిలోని న్యూ ఎరా, శివరాంపల్లిలోని షాహీన్, తెల్లాపూర్?లోని వశిష్ట, బర్కత్?పురాలోని హైందవి, ఎస్‌ఆర్‌నగర్‌లోని రెజోనెన్స్ కాలేజీలు ఉన్నతాధికారుల ఫోర్జరీ సంతకాలతోనే నకిలీ ఎన్‌వోసీలను ఇంటర్ బోర్డుకు పంపించినట్లు అధికారులు గుర్తించారు.

బోర్డులోని అధికారులు కుమ్మక్కు

ఉన్నతాధికారుల సంతకాల ఫోర్జరీకి పాల్పడిన కళాశాలల గుర్తింపు కూడా రద్దు చేయాలని హైడ్రా అధికారులు ఇంటర్‌బోర్డును కోరారు. అయితే కొందరు ఇంటర్‌బోర్డులోని అధికారులు కూడా ఈ వ్యవహారంలో కుమ్మక్కైనట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మొత్తంగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. దర్యాప్తులో ఎటువంటి విషయాలు వెలుగు చూస్తాయో వేచి చూడాల్సి ఉంది.

## ఇకపై ఎరువుల బుకింగ్‌కు బయోమెట్రిక్?!

-మొదటిపేజీ తరువాయి

నమోదు చేశారు. రామచంద్రాపురం యూనిట్ బృందాల పరిశీలనలో 14.53 టన్నుల యూరియా మాయమైనట్లు తేలింది. అలాగే హైదరాబాద్ సిటీ-2 యూనిట్ తనిఖీల్లో 2.25 టన్నుల నకిలీ డీఏపీని గుర్తించారు. సంబంధిత వ్యక్తులపై 3 కేసుల్ని నమోదు చేయించింది.



**విజిలెన్స్ సిఫార్సులు ఇలా**

ప్రస్తుతం యాప్‌లో ఉన్న ప్రధాన లోపం కౌలు రైతులు ఎరువుల బుకింగ్ కోసం భూయజమాని సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీపైనే ఆధారపడుతున్నారు. దీని ద్వారా డీలర్లతోపాటు మరికొంతమంది అక్రమాలకు పాల్పడుతున్నారు. ఒకవేళ భూయజమాని అనుమతినిస్తే నిర్దిష్ట కాలానికి కౌలు రైతును అధీకృత ఎరువుల గ్రహీతగా నామినేట్ చేసే అవకాశాన్ని ఇవ్వొచ్చు. ఈ-పోస్ యంత్రం ద్వారా నామినీ తన గుర్తింపును ధ్రువీకరించుకొనేందుకు అనుమతించాలి. ఎరువుల యాప్‌కు అలాగే బయోమెట్రిక్ ప్రామాణీకరణ కోసం ఉపయోగించే ఈ-పోస్ యంత్రం మధ్య అనుసంధానం లేదు. దాంతో ఎరువుల యాప్‌ను ఈ-పోస్ పరికరాన్ని రియల్‌టైం రీకన్సీలియేషన్‌తో ఒకే బ్యాకెండ్‌లో అనుసంధానించాలి. ఎరువుల బుకింగ్, పంపిణీ రెండింటిలో లబ్ధిదారు బయోమెట్రిక్ తప్పనిసరి చేయాలి. ప్రస్తుతం ఉన్న యాప్‌తో పాటు ఐవీఆర్‌ఎస్ విధానాన్ని తీసుకుని రావాలి. డయల్-ఇన్, వాయిస్-గైడెడ్ మెనూ ద్వారా సులభంగా బుకింగ్‌ను అనుమతించేలా ఈ ప్రక్రియను రూపొందించాలి. దీనివల్ల బుకింగ్ కోసం లబ్ధిదారు డీలర్లపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చు.

నవగీత
తెలుగు దినపత్రిక
గురువారం
6 ఆగస్టు 2026

## సంపాదకీయం

# గేమ్ ఛేంజర్ కానున్న సముద్ర మంథన్

ముడిచమురు, సహజవాయువు (గ్యాస్) అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు భారత్ కీలక అడుగు వేసింది.సముద్రగర్భంలో దాగి ఉన్న చమురు, గ్యాస్ నిల్వలను వెలికితీయడమే లక్ష్యంగా రూ.84,084 కోట్ల అంచనా వ్యయంతో 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.ఈ పథకం కింద సముద్రంలోని అత్యంత లోతైన, ప్రమాదకర ప్రాంతాల్లో చమురు, గ్యాస్ అన్వేషణ కోసం తవ్వే బావులకు అయ్యే ఖర్చులో సగం లేదా గరిష్ఠంగా రూ.650 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం నేరుగా బడ్జెట్ ద్వారా భరించనుంది.ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో, అంటే 2031 నాటికి, సముద్రగర్భంలో సుమారు 60 లోతైన, అత్యంత లోతైన బావులు తవ్వేందుకు రూ.43,200 కోట్లు కేటాయించారు.ఒక్కో బావికి గరిష్ఠంగా రూ.650 కోట్ల వరకు వ్యయం చేయనున్నారు. అలాగే ఆఫ్‌షోర్ ప్రాంతాల్లో సీస్మిక్, జియోలాజికల్ సర్వేలు నిర్వహించి చమురు, గ్యాస్ నిల్వల అవకాశాలను గుర్తించేందుకు రూ.28,534 కోట్లు వెచ్చించనున్నారు.సముద్రంలో లభించే చమురు, గ్యాస్‌ను తీర ప్రాంతాలకు తరలించేందుకు గ్యాస్ పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.10,000 కోట్లు ఖర్చు చేయనున్నారు.అదనంగా ఆఫ్‌షోర్ రంగానికి అవసరమైన యంత్రాలు, సేవలు అందించే పారిశ్రామిక జోన్‌ల అభివృద్ధికి రూ.2,000 కోట్లు కేటాయించారు.లోతైన సముద్ర ప్రాంతాల్లో చమురు అన్వేషణలో విజయవంతం కాకపోతే భారీ పెట్టుబడులు వృథా అవుతాయనే భయంతో ప్రైవేట్ కంపెనీలు ఇప్పటివరకు ఈ రంగానికి దూరంగా ఉన్నాయి.చమురు నిల్వలు ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే తొలిసారిగా ప్రభుత్వం స్వయంగా బడ్జెట్ నిధులతో ఈ అన్వేషణలోని రిస్క్‌ను భరించేందుకు ముందుకొచ్చింది.చిన్న మొత్తాల్లో చమురు నిల్వలు లభించినా వాటిని వాణిజ్యపరంగా వినియోగించుకునేలా ప్రభుత్వ సాయంతో ఉమ్మడి పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ మౌలిక వసతులు అభివృద్ధి చేయనుంది. దీంతో కంపెనీలపై పడే మౌలిక సదుపాయాల ఖర్చు గణనీయంగా తగ్గనుందగత పదేళ్లలో దేశంలో ముడిచమురు అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటం 77 శాతం నుంచి 88 శాతానికి పెరిగిందిఅలాగే దేశ అవసరాల్లో సగానికి పైగా సహజవాయువు కూడా దిగుమతుల ద్వారానే వస్తోంది.'సముద్ర మంథన్' పథకం ద్వారా ప్రతి ఏడాది 10 నుంచి 15 మిలియన్ టన్నుల అదనపు చమురు ఉత్పత్తి సాధించి, దిగుమతులను 3 నుంచి 5 శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.భారత్‌లో చమురు, గ్యాస్ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 1997 నుంచి విధానాలను క్రమంగా సరళీకరిస్తోంది.ఇందులో భాగంగా 2016లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ , ఓపెన్ ఎకరేజ్ లైసెన్సింగ్ పాలసీ లను ప్రవేశపెట్టింది.అలాగే 2025 ఏప్రిల్‌లో అమల్లోకి వచ్చిన ఆయిల్ ఫీల్డ్స్ సవరణ చట్టం ద్వారా పన్నులు, లీజు విధానాలను మరింత సులభతరం చేసింది.ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు భారత్ తన చమురు అన్వేషణను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ సుమారు 18 నుంచి 20 బిలియన్ డాలర్ల భారీ వ్యయంతో లోతైన సముద్ర గర్భంలో డ్రిల్లింగ్ చేసేందుకు ప్రపంచవ్యాప్త టెండర్లను ఆహ్వానించింది. ఐదేళ్ల కాల పరిమితితో అత్యాధునిక డ్రిల్‌షిప్‌లు, సెమీ-సబ్ మెర్సిబుల్ రిగ్‌లను అద్దెకు తీసుకోవడమే ఈ టెండర్ ప్రధాన ఉద్దేశం. ఓఎన్‌జీసీ తన అన్వేషణ ప్రణాళికను కేవలం పాత బేసిన్‌లకే పరిమితం చేయకుండా, కొత్త సరిహద్దులను వెతుకుతోంది. ప్రస్తుతం చమురు ఉత్పత్తి అవుతున్న కృష్ణ-గోదావరి బేసిన్‌లో కార్యకలాపాలను ముమ్మరం చేయడంతో పాటు, ఇప్పటివరకు పెద్దగా అన్వేషించని అండమాన్, నికోబార్ దీవుల సమీపంలోని అత్యంత లోతైన జలాలపై దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టులోని సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రపంచ చమురు దిగ్గజాలైన ఎక్సాన్‌మొబిల్, బీపీ, టోటల్ ఎనర్జీస్, పెట్రోబ్రాస్‌ల సహకారాన్ని ఓఎన్‌జీసీ కోరుతోంది. ముంబైలో జరిగిన ప్రీ-బిడ్ సమావేశానికి ఇప్పటికే డజనుకు పైగా అంతర్జాతీయ సంస్థలు హాజరవ్వడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను చాటిచెబుతోంది. రష్యా చమురుపై పెరిగిన మొగ్గు.. ఒకవైపు స్వదేశీ అన్వేషణ జరుగుతుండగానే, మరోవైపు తక్షణ అవసరాల కోసం భారత్ రష్యా నుంచి భారీగా ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరియు హార్ముజ్ జలసంధి వద్ద అంతరాయాల కారణంగా ప్రపంచ సరఫరా తగ్గడంతో, భారత రిఫైనరీలు ఏప్రిల్ డెలివరీ కోసం సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల రష్యా ముడి చమురును కొనుగోలు చేశాయి. ఇది ఫిబ్రవరి నెల కొనుగోళ్ల కంటే రెట్టింపు కావడం గమనార్హం. అమెరికా ఇచ్చిన తాత్కాలిక మినహాయింపులు కూడా రష్యా నుంచి చమురు సేకరణ పెరగడానికి మార్గం సుగమం చేశాయి.సంస్కరణలకు కొనసాగింపుగానే ఇప్పుడు 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'ను తీసుకొచ్చింది.ఈ పథకం ద్వారా భారత చమురు క్షేత్రాల్లోకి అంతర్జాతీయ ఇంధన దిగ్గజాలను ఆకర్షించడంతో పాటు, దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# 'సహజీవన' హింస నేరమే!

సహజీవన బంధాల్లో క్రూరత్వాన్ని ఎదుర్కొనే మహిళలకు ఊరటనిచ్చేలా గృహహింస చట్టం పరిధిని విస్తరిస్తూ సర్వోన్నత న్యాయస్థానం సోమవారం వెలువరించిన తీర్పు మహిళలకు ఊరటనిస్తుంది. యుక్త వయసు వచ్చిన జంట పరస్పర అంగీకారంతో వివాహ వ్యవస్థ వెలుపల కూడా సహజీవనం సాగించవచ్చంటూ గతంలో న్యాయస్థానాలు పలు సందర్భాల్లో తెలిపాయి. అయినా ఇలాంటి బంధాలు తరచు వివాదాస్పదం అవుతూనే ఉన్నాయి. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా కొన్ని రాష్ట్రాల హైకోర్టులు వేర్వేరు కేసుల్లో ఈ బంధాల్లోని నైతికతను ప్రశ్నిస్తూనే ఉన్నాయి. వివాహ బంధాల్లో ఉండే రక్షణలు సహజీవన బంధాల్లో ఉండబోవని హితోక్తులు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో 'వివాహ స్వభావం కలిగిన' సహజీవన బంధంలో ఉండే భాగస్వామి నుంచి మహిళ హింసను ఎదుర్కొంటే ఐపీసీ సెక్షన్ 498ఏ(బీఎన్ఎస్ సెక్షన్లు 85, 86) కింద కేసు పెట్టవచ్చని సుప్రీంకోర్టు తాజాగా స్పష్టం చేసింది. పరస్పర అవగాహన ద్వారా ఒక జంట సహజీవనం చేస్తున్నప్పుడు ఆమెను హింసించే పరిస్థితులు తలెత్తినప్పుడు చట్టం ఆమెకు రక్షణగా నిలబడాలి. ఇప్పుడు తాజా తీర్పువల్ల అలాంటి మహిళలకు భద్రత ఉంటుంది.

నాలుగు దశాబ్దాల క్రితం చట్టం ఇంత స్పష్టంగా లేదు. అసలు మన చట్టాల్లో సహజీవన సంబంధాలకు ఎప్పుడూ చోటులేదు. కానీ 2005లో వచ్చిన గృహహింస నిరోధక చట్టం తొలిసారి 'వివాహ స్వభావం' కలిగిన సంబంధంలో ఉన్న మహిళ సమస్యలు ఎదుర్కొంటున్న పక్షంలో ఆమెను బాధిత పక్షంగా గుర్తించింది. ఆడ, మగ ఒకే ఇంట్లో కలిసివుంటూ జీవితభాగస్వాములన్న అభిప్రాయం సమాజంలో కలిగిస్తే, వారు పెళ్లీడుకొచ్చివుంటే, తగినంతకాలం శారీరక సంబంధంలో కొనసాగుతూవుంటే ఆ బంధాన్ని 'వివాహ స్వభావం'గల బంధంగా గుర్తించవచ్చని సుప్రీంకోర్టు 2011లోనే ఒక కేసులో చెప్పింది. వారాంతాల్లో కలిసివున్నప్పుడు ఇది వర్తించబోదని తెలిపింది. కానీ సుప్రీంకోర్టు తాజా తీర్పు పెళ్లికానంత మాత్రాన ఒక బంధంలో కొనసాగే పురుషుడు మహిళను హింసిస్తుంటే 498ఏ వర్తించబోదనటం సరికాదని వివరించింది. చట్టంలోని



'భర్త' అనే పదాన్ని మరీ సంకుచితంగా తీసుకుని యాంత్రికంగా వర్తింపజేసి బాధిత మహిళకు న్యాయం చేయకపోవటం సరికాదని ధర్మాసనం చెప్పడం గమనించదగింది. లాంఛనంగా పెళ్లి ధ్రువీకరణ పత్రం లేనంతమాత్రాన ఆ బంధంలోని వివాహ స్వభావాన్ని గుర్తించకపోవటం, అక్కడ జరిగే హింసను విస్మరించటం సమాజ పురోగతికి తోడ్పడబోదని కూడా తెలిపింది.

ఇద్దరు వ్యక్తులు సహజీవన బంధంలోకి వెళ్లి, వారి మధ్య తలెత్తే విభేదాలు మహిళను హింసించటానికి దారితీస్తే దాన్ని నేరంగా పరిగణించకపోవటం ఎలా చూసినా సరికాదు. సహజీవనంలోవుండే మహిళకు గృహహింస చట్టంకింద ఉన్న రక్షణలు సరిపోతాయనీ, అందువల్ల 498ఏ పరిధిని విస్తరించటం అనవసరమనీ ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం వాదించినా ధర్మాసనం దీన్ని దృష్టిలో ఉంచుకునే తోసిపుచ్చింది. గృహహింస చట్టం కేవలం మనోవర్తి, పరిహారం, ఇంట్లో కొనసాగే హక్కువంటి సివిల్ ఉపశమనాలు మాత్రమే ఇస్తున్నదని... ఆ నేరానికి తగిన శిక్ష ఉండొద్దా అని న్యాయమూర్తులు ప్రశ్నించటం గమనార్హం. ప్రస్తుత కేసులో మహిళ తాను వివాహానికి సిద్ధపడే ఈ సహజీవన బంధంలోకి ప్రవేశించాననీ, కానీ అప్పటికే అతగాడికి పెళ్లయిన విషయాన్ని దాచాడనీ తెలిపింది. సుప్రీంకోర్టు ఈ కేసులోని నిజానిజాల్లోకి పోకుండానే మహిళా క్రూరత్వాన్ని చవిచూస్తుంటే 498ఏ వర్తించితీరాలని తెలిపింది.

చట్టాలు చేసే సందర్భాల్లో పార్లమెంటు అవగాహనకు రాని విషయాలు, అప్పటికి అలాంటి పరిస్థితులు లేని సందర్భాలు అనంతర కాలంలో తలెత్తవచ్చు. అంతమాత్రాన సమాజంలో వచ్చిన మార్పుల్ని పరిగణనలోకి తీసుకోకుండా యాంత్రికంగా అన్వయించటంతో సరిపెడితే బాధితులకు ఎప్పటికీ న్యాయం దక్కదు. అయితే సహజీవనానికి సంబంధించి నిర్దిష్టమైన చట్టం లేకపోవటం వల్ల ఇలాంటి బంధాల్లో ఏర్పడే సమస్యల విషయంలో వచ్చే కేసుల్ని న్యాయస్థానాలు పదే పదే విచారించి తేల్చవలసి వస్తున్నది. కనుక వర్తమాన సామాజిక స్థితిగతుల్ని దృష్టిలో ఉంచుకుని ఆ మాదిరి చట్టం అవసరాన్ని ప్రభుత్వం గుర్తించటం అవసరం.

# సంకుచిత పాలకుడి సంస్కారహీన భాష

ఒక రాష్ట్ర భవిష్యత్తు ఎక్కడ ఉంటుంది? శాసనసభలో నా? సచివాలయంలోనా? లేక అధికార పార్టీ కార్యాలయంలోనా? అ క్కడెక్కడా కాదు. విశ్వవిద్యాలయా ల ప్రాంగణాలు, తరగతి గదుల్లో ఉంటుంది. కుటుంబం, సమాజం, రాష్ట్రం కోసం మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని కలలుగనే విద్యార్థుల ఆలోచనలో, విద్యార్థుల చైతన్యంలో రాష్ట్ర భవిష్యత్తు కూడా ఉం టుంది. అటువంటి విద్యార్థులను అవమానించడం అంటే రాష్ట్ర భవిష్యత్తును అవమానించడమే. ప్రభుత్వాలు, నాయకులు మారవచ్చు, కానీ విద్యార్థుల కలలు చెదిరిపోతే ఆ నష్టాన్ని ఏ ప్రభుత్వం కూడా పూడ్చలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాంటి వ్యక్తి విద్యార్థులు, యువత గురించి చేసిన పలు వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి, రాష్ట్రంలో ఏటా లక్షా పది వేల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ చదువుతున్నారని, వారికి ఉద్యోగ దరఖాస్తు రాయడం కూడా రాదని నోరు పారేసుకున్నారు. వారి చదువు క్రిమినల్ వేస్ట్‌గా మారిందని వ్యాఖ్యానించారు. లక్షలాది మంది యువత చదువును, బోధించిన ఉపాధ్యాయులను అవమానించేలా మాట్లాడడం దారుణం. విద్యార్థుల ప్రతిభ నిజంగానే ఉద్యోగాలకు సిద్ధంగా లేకపోతే, ఆ పరిస్థితికి బాధ్యులు ఎవరు? పాఠ్య ప్రణాళికలను రూపొందించేది, వర్సిటీలను నియంత్రించేది, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాల్సింది, పరిశ్రమల అవసరాలకు మేరకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సింది ప్రభుత్వం.

విద్యార్థుల నైపుణ్య సాధనలో ప్రభుత్వానికి బాధ్యతే లేదన్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరించడం ఎంతవరకు సమంజసం? ప్రభుత్వ పాఠశాలల విలీనం లేదా మూసివేతకు సంబంధించిన నిర్ణయాలు, విశ్వవిద్యాలయాల భూములపై తలెత్తిన వివాదాలు, ఖాళీలను భర్తీ చేయకపోవడం, ఉన్నత విద్యకు సంబంధించిన పథకాల అమలుపై వచ్చిన విమర్శలను కలిపి చూస్తే విద్యా రంగంపై ప్రభుత్వ నిబద్ధత ఏమిటనే ప్రశ్న ముందుకు వస్తున్నది. గత ప్రభుత్వం విదేశీ విద్యా సహాయ పథకం ద్వారా పేద విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్య కోసం ఆర్థిక సాయం చేసింది. ప్రస్తుతం ఆ పథకం అమలు, చెల్లింపులపై అనిశ్చితి నెలకొన్నది. ఈ అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలి. తెలంగాణలో విద్య, విద్యార్థులు, ఉన్నత విద్య పట్ల ప్రభుత్వ వైఖరి తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. ఒకవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అత్యంత కీలకమైన సంక్షేమ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయలేకపోతున్నది. మరోవైపు ఇంజినీరింగ్ విద్యార్థులను అవమానించే వ్యాఖ్యలు చేయడం బాధాకరం. ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ప్రభుత్వానికి భారంగా భావించాల్సిన వ్యయం కాదు. అది సమాజ భవిష్యత్తుపై చేసే అత్యంత విలువైన పెట్టుబడి. విద్యపై ప్రభుత్వం చేసే ప్రతి రూపాయి ఖర్చు, భవిష్యత్తులో పన్నుల రూపంలోనూ, నైపుణ్యం కలిగిన మానవ వనరుల రూపంలోనూ, ఆర్థికాభివృద్ధి రూపంలోనూ అనేక రెట్లు తిరిగి వస్తుంది. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలన్నీ ఇదే సూత్రాన్ని అనుసరించాయి. అలాంటి పథకాలను అమలు చేయడంలో వైఫల్యాన్ని దాచిపెట్టడానికి విద్యార్థులనే లక్ష్యంగా చేసుకోవడం పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం. బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు చేశారని అనుకోవాల్సి వస్తుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై విమర్శలు వచ్చినప్పుడు, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇవ్వడం లేదని, అక్కడ ఇవ్వనప్పుడు తాను ఎలా ఇస్తాననే తరహాలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఒక రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను మరో రాష్ట్రంతో పోల్చుకుని తప్పించుకోవడం పరిపాలనా ప్రమాణాలను దిగజార్చడమే. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టింది, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అనుసరించడానికి కాదు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి ఆందోళనలను వినాల్సిన ప్రభుత్వం, వారినే అవమానించే వ్యాఖ్యలు చేయడం తీవ్ర నిరాశ కలిగిస్తున్నది. విద్యార్థులను ప్రత్యర్థులుగా కాదు, భాగస్వాములుగా చూడాలి, వారి ఆవేదనను వినాలి, వారి భవిష్యత్తును నిర్మించే విధానాలు రూపొందించుకోవాలి. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో విద్య, ఐటీ, పారిశ్రామిక అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచింది. తెలంగాణలో నేడు విద్యార్థులను అవమానిస్తూ పాలకులు వార్తల్లో నిలువడం నిజంగా రాష్ట్రానికి బాధాకరం. ప్రభుత్వం చేయాల్సింది ఏంది? ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సమయానికి విడుదల చేయాలి. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలి. పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. ఇంగ్లిష్, కమ్యూనికేషన్, డిజిటల్ నైపుణ్యాలను ప్రోత్సహించాలి. ప్రజలు ఇప్పుడు అడుగుతున్న ప్రశ్న ఒక్కటే? విద్యార్థులను గౌరవించలేని వ్యక్తికి విద్యామంత్రిగా కొనసాగడానికి నైతిక అర్హత ఉన్నదా? విద్యార్థులు క్రిమినల్ వేస్ట్‌గా కాదు, నేషన్ బిల్డర్స్‌గా చూసే దృక్పథమే తెలంగాణకు అవసరం. కాబట్టి కాంగ్రెస్ సంకుచిత పాలకులు, సంస్కారహీన భాషను కట్టిపెట్టాలి. విద్యను ఖర్చుగా కాదు, భవిష్యత్తుపై పెట్టుబడిగా చూసే విధానమే రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తుంది. జై తెలంగాణ!

# ఇన్సూరెన్స్ లేకపోతే.. పెట్రోల్, డీజిల్ బంద్

**భువనేశ్వర్ :** బీమా లేని వాహనాలపై కఠిన చర్యలకు భారత అత్యున్నత న్యాయస్థానం సిద్ధమవుతోంది. మోటార్ థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయించే లక్ష్యంతో సుప్రీంకోర్టు పలు కీలక ప్రతిపాదనలు చేసింది. ఇందులో భాగంగా, వాహనానికి చెల్లుబాటు అయ్యే బీమా ఉందో లేదో ధృవీకరించిన తర్వాతే పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే విధానంపై పైలట్ ప్రాజెక్టును రూపొందించాలని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ , కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖను ఆదేశించింది. ప్రతిపాదిత విధానం ప్రకారం, బీమా లేని వాహనాలకు అవసరమైన కవరేజీ పొందే వరకు ఇంధనం నిరాకరించే అవకాశాన్ని పరిశీలించనున్నారు. అయితే, ఇది ప్రస్తుతం కేవలం పైలట్ ప్రాజెక్టు మాత్రమేనని, దేశవ్యాప్తంగా వెంటనే అమల్లోకి రాదని స్పష్టం చేసింది.అంతే కాకుండా, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను వాహన్ డేటాబేస్, బీమా డేటా బేస్‌లతో అనుసంధానించాలని కూడా సుప్రీంకోర్టు ప్రతిపాదించింది. దీంతో బీమా లేని వాహనాలను ఆటోమెటిక్‌గా గుర్తించి, అవసరమైతే ఇ-చలాన్లు జారీ చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటికే అతివేగం, రెడ్ సిగ్నల్ ఉల్లంఘన, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను గుర్తించేందుకు ఉపయోగిస్తున్న ఐటిఎంఎస్ వ్యవస్థను బీమా ధృవీకరణకు కూడా వినియోగించాలని సూచించింది.రోడ్డు తనిఖీల సమయంలో ట్రాఫిక్ పోలీసులకు మొబైల్ యాప్‌లు




లేదా హ్యాండ్‌హెల్డ్ పరికరాలను అందించి, వాహన బీమా వివరాలను తక్షణమే పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. దీంతో భౌతిక బీమా పత్రాలపై ఆధారపడకుండా అధికారులు ఆన్‌లైన్‌లోనే బీమా స్థితిని నిర్ధారించగలరు. కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు తప్పనిసరి థర్డ్-పార్టీ బీమా కాలపరిమితిని కూడా పెంచాలని సుప్రీంకోర్టు సూచించింది. కొత్త ప్రైవేట్ కార్లకు ప్రస్తుతం ఉన్న మూడు సంవత్సరాల బీమాను నాలుగు సంవత్సరాలకు, ద్విచక్ర వాహనాలకు ఐదు సంవత్సరాల బీమాను ఆరు సంవత్సరాలకు పొడిగించాలని ప్రతిపాదించింది. ప్రారంభ బీమా గడువు ముగిసిన తర్వాత బీమా పునరుద్ధరించకుండా రోడ్లపై తిరిగే వాహనాల సంఖ్యను తగ్గించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని కోర్టు పేర్కొంది. ఇప్పుడు ఈ ప్రతిపాదనలను ఎలా అమలు చేయాలనే అంశాన్ని సంబంధిత అధికారులు పరిశీలించనున్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
6 ఆగస్టు 2026

# సైబర్ భద్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి








"సురక్షా కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ" ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల, ఆగష్టు5,(నవగీతం)** తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే "సైబర్ జాగ్రూక్తా దివస్" కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం కోరుట్ల పట్టణంలోని పీబీ ఫంక్షన్ హాల్‌లో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు ఎస్పీ చేతన్ నితిన్ పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, డిజిటల్ భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాలు, వాటి నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలి, ఫేక్ లింకులు, మోసపూరిత ఫోన్ కాల్స్, సోషల్ మీడియా మోసాలు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడి మోసాలు, క్యూ ఆర్ కోడ్ స్కామ్‌లు, ఓటీపీ మోసాలు, ఆన్‌లైన్ గేమింగ్ మోసాలు తదితర అంశాలపై సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో, అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా ద్వారా నకిలీ అకౌంట్లు, ఫేక్ లింకులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు,గిఫ్ట్ ఆఫర్లు,లక్కీ డ్రా పేర్లతో మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, సందేశాలు లేదా లింకులను నమ్మవద్దని, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ నంబర్, ఆధార్ వివరాలు, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అలాగేవ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ఆన్‌లైన్‌లో ఏదైనా అనుమానాస్పద లావాదేవీలు లేదా సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని, అలాగే పోర్టల్‌లో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే ఆర్థిక నష్టాన్ని తగ్గించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని, సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగంపై వారికి అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామ ప్రజలకు కూడా తెలియజేసి సైబర్ నేరాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయి, సైబర్ మోసాలకు నేరస్తులు అనుసరిస్తున్న కొత్త పద్ధతులు ఏమిటి, వాటి పట్ల ప్రజలు ఎలాంటి అప్రమత్తతతో వ్యవహరించాలనే అంశాలను విద్యార్థులు నాటిక రూపంలో అద్భుతంగా ప్రదర్శించారు. ఈ నాటిక ద్వారా సైబర్ నేరాలపై అవగాహనతో పాటు ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను సందేశాత్మకంగా వివరించారు. సైబర్ భద్రతపై చైతన్యం కలిగించేలా నాటికను ప్రదర్శించిన విద్యార్థులను జిల్లా ఎస్పీ అభినందించి, వారి ప్రతిభను ప్రశంసిస్తూ బహుమతులను ప్రదానం చేశారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఆగస్టు--2026 స్వాతంత్ర్య మాసం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "సురక్ష కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ" సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీచేతన్ నితిన్, ఐపీఎస్, డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐలు గంగారం, రవికిరణ్, సైబర్ క్రైమ్ ఎస్ఐలు కృష్ణ, దినేష్, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాశీ ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ)డి. శ్రీనివాస్ రెడ్డి



**కరీంనగర్, ఆగస్టు5,(నవగీతం)** జిల్లా కేంద్రశీ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాశీను బుధవారం అదనపు కలెక్టర్ (రెవిన్యూ )డి. శ్రీనివాస్ రెడ్డి రాజ కీయ పార్టీ ప్రతినిధిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ )డి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాశీ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవియం గదుల వి వి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మార్వో రాజేష్, బి ఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ ,బిజెపి పార్టీ ప్రతినిధి నాశీపల్లి శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు మిడిదొడ్డి కపిల్, మహమ్మద్ పహాద్ ఎంఐఎం పార్టీ ప్రతినిది మజిత్ హుస్సేన్ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## దశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



**ములుగు,ఆగస్టు5,(నవగీతం)**ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో కీ.శే.దంతులూరి విశ్వనాథ ప్రసాద్ రాజు దశదిన కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు , మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మి నారాయణ, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడికుల అశోక్, ఏటూరు నాగారం మండల బ్లాక్ అధ్యక్షులు ఇరుసవడ్ల వెంకన్న.రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీ.శే. ప్రసాద్ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మారుమూల ప్రాంతాలు, గిరిజన గ్రామాల్లో ప్రజలకు ఆయన అందించిన సేవలను నాయకులు స్మరించుకుంటూ, పార్టీ కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ప్రజల కోసం నిరంతరం సేవ చేసిన ప్రసాద్ బాబు రాజు సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఏడుగురికి కారుణ్య నియామక పత్రాలు అందించిన కలెక్టర్



**కరీంనగర్,ఆగష్టు5,(నవగీతం)** జిల్లాలో వివిధ శాఖల్లో కారుణ్య నియామకం కింద ఏడుగురికి ఉద్యోగాలు కల్పించినట్లు బుధవారం కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. వివిధ శాఖల్లో ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లుగా, ఇద్దరినీ ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించినట్లు పేర్కొన్నారు. వారికి కలెక్టరేట్ లోని తన చాంబర్ లో కలెక్టర్ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉద్యోగం పొందిన వారు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ స్వామి తదితరులు పాల్గొన్నారు. కారుణ్య నియామకాలు పొందిన వారి వివరాలు వినేష్ –ఆఫీస్ సబార్డినేట్ (పశుసంవర్ధక శాఖ)అభిలాష్–ఆఫీస్ సబార్డినేట్ (ట్రెజరీ) వేల్పుల సుమలత– జూనియర్ అసిస్టెంట్ (సీపీఓ ఆఫీస్) వకులాభరణం విషంత– జూనియర్ అసిస్టెంట్ (వర్క్స్ ఆండ అకౌంట్స్)రేహ ఫాతిమా– జూనియర్ అసిస్టెంట్ (కరీంనగర్ జీజీహెచ్) కొల్ల రాజు– జూనియర్ అసిస్టెంట్ (కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం)శ్రీలక్ష్మి– జూనియర్ అసిస్టెంట్ (కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం)

## హాస్పిటల్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి..కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 5,(నవగీతం)** జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, ఎలాంటి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం--2010 కింద ఏర్పాటైన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ జిల్లా స్థాయి సమావేశం బుధవారం రాత్రి కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల వివరాలు, వివిధ శాఖల నుంచి రావాల్సిన ఎన్‌వోసీల స్థితిగతులపై అధికారులను ఆరా తీశారు. ఆలస్యానికి తావు లేకుండా పోలీసు, అగ్నిమాపక, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి అన్ని దరఖాస్తులను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని ఆసుపత్రులకు లోపాలను తెలియజేసి వాటిని సరిచేసుకునే అవకాశం కల్పించాలని, నిబంధనలకు అనుగుణంగా ఉన్న ఆసుపత్రులకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రైవేట్‌గా ఆరోగ్య సేవలు అందించే ప్రతి ఆసుపత్రి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ప్రతి ఐదేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఏ ప్రైవేట్ ఆసుపత్రి కూడా వైద్య సేవలు అందించరాదన్నారు. రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు అందిన వెంటనే అర్హతలు, ప్రమాణాలను పరిశీలించి ముందుగా ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేయాలని, అనంతరం అన్ని నిబంధనలు పాటించిన ఆసుపత్రులకు ఐదేళ్ల కాలపరిమితితో శాశ్వత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని తెలిపారు. ప్రతి ఆసుపత్రిలో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో పాటు సేవల చార్జీలు, టారిఫ్ వివరాలను ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని సూచించారు. అర్హత కలిగిన వైద్యులు, సిబ్బంది మాత్రమే వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని, అనర్హులు వైద్య సేవలు అందించకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రాజగోపాలరావు, డెమో శ్రీనివాస్, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షురాలు డా. ఆకుల శైలజ, ప్రధాన కార్యదర్శి డా. మహేష్‌తో పాటు పోలీసు, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూలు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలి



**ఇబ్రహీంపట్నం ,ఆగష్టు5,(నవగీతం)** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో ఐదు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం రోజు ఉదయం మృతి చెందిన ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వర్షకొండ గ్రామనికి చెందిన సల్వాల రాజేష్,(30)అనే యువకుడుజులై 31 న,సాయంత్రం పని నిమిత్తం ఎర్గట్ల వెళ్లి వర్షకొండ గ్రామానికి వస్తున్న సమయంలో వర్షకొండ గ్రామ బస్టాండ్ దగ్గర చర్చి ముందు రవీంద్ర స్కూల్ మెట్ పల్లి కి చెందిన బస్సు ౦+ 21౦ 1192 డ్రైవర్ గుండు గణేష్ (59 ) మెట్ పల్లి బస్సును అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా నడుపుతూ బస్సును వెనక్కి తీస్తూ ఆకస్మాత్తుగా రోడ్డుపైకి ఎక్కించగా మృతుడు సల్వాల రాజేష్,(28) వర్షకొండ, నడుపుతున్న ద్విచక్ర వాహనం యమహా ౼ా 21జ 1115 బండి అదుపుతప్పి స్కూల్ బస్సు ముందు టైరు భాగంలో గుద్దుకోగా మృతుడు రోడ్డుపై పడి తలకి గాయమై అధిక రక్తస్రావం అవ్వగా వెంటనే స్థానికులు మెట్ పల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మైత్రి హాస్పిటల్ కి తరలించగా అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ పట్టణంలోని ప్రతిభ హాస్పిటల్లో అడ్మిట్ చేయగా చికిత్స పొందుతూ ఈ నెల 5 వ తేదీన మధ్యాహ్నం మరణించినాడని డాక్టర్లు ధ్రువీకరించినారని మృతుడి తల్లి అయిన సల్వాల నర్సు (58) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జి నవీన్ కుమార్ తెలిపారు.

## ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా భద్రాచలం ఎమ్మెల్యే -

అనారోగ్య బాధితురాలికి రూ3 లక్షల ఎల్ ఓ సి అందజేత.



**ములుగు, ఆగష్టు5,(నవగీతం)**ఆపదలో ఉన్న పేద ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటామని చెప్పేందుకు నిదర్శనంగా భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. భద్రాచలం నియోజకవర్గం ములుగు జిల్లా నూగూరు వెంకటాపురం మండలం సురవీడు గ్రామానికి చెందిన పూనెం మోహన్విత గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. అధిక ఖర్చులతో కూడిన చికిత్సకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబం స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ను ఆశ్రయించింది.వారి విన్నపాన్ని సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే , వెంటనే ప్రభుత్వం నుండి రూ.3 లక్షల విలువైన ఎల్ ఓ సి మంజూరు చేయించారు. మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మోహన్విత కుటుంబ సభ్యులను పిలిపించి, ఆ ఎల్ ఓ సి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, ప్రజా సేవే మా లక్ష్యం. ప్రజల ఆరోగ్యమే మాకు ప్రథమ ప్రాధాన్యత. ఆపదలో ఉన్న ఏ ఒక్కరిని కూడా ఒంటరిగా వదిలిపెట్టం. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సహాయం అందేలా చూస్తాం" అని అన్నారుమా పరిస్థితిని అర్థం చేసుకుని పెద్ద మొత్తంలో సహాయం చేసిన ఎమ్మెల్యే కి జీవితాంతం రుణపడి ఉంటాం" అని కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రత్నం రమాకాంత్, పెద్దినేని శ్రీనివాస్, బొల్లినేని ధర్మారావు, యూత్ కాంగ్రెస్ నాయకుడు గాడి విజయ్ తదితరులు పాల్గొని ఎమ్మెల్యే గారి చొరవను అభినందించారు.

## అంగన్వాడి కేంద్రానికి స్థలం కేటాయించాలని వినతి



**ములుగు,ఆగస్టు5,(నవగీతం)** ములుగు జిల్లా వాజేడు మండలంలోని మొరుమూరు గ్రామపంచాయతీ పరిధిలో గల ఘనపురం కాలనీ గ్రామంలో అంగన్వాడి కేంద్రానికి స్థలం లేక, వేరే ఊరు అంగన్వాడి కేంద్రానికి పిల్లలని పంపించలేక పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందికి గురౌతున్నారు. పక్కా అంగన్వాడి భవనం మంజూరు అయినప్పటికీ సరైన స్థలం లేక భవనం నిర్మించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. చేసేది ఏమిలేక గ్రామానికి ఎదురుగా ఉన్న అటవీ శాఖకు సంబంధిన భూమిలో అంగన్వాడి కేద్రం పక్కా భవనం నిర్మించుకొనుటకు స్థలం కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, భద్రాచల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య కు వినతిపత్రం అందజేశారు. ఈయొక్క కార్యక్రమంలో ములుగు జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి, చిచ్చడి రాఘవులు, వాజేడు మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు అట్టం రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**మల్లాపూర్,ఆగస్టు5,(నవగీతం)** మల్లాపూర్ మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ శంకరమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ మాట్లాడుతూపుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టడం ద్వారా శిశువులో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలి, నీరు కూడా అవసరం లేదు.తల్లిపాలలో బిడ్డ ఎదుగుదలకు కావలసిన అన్ని పోషకాలు, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి.శిశువుకు కూడా జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది. అంటువ్యాధులు, దగ్గు, జలుబు, డయేరియా వంటి అనారోగ్యాల నుండి రక్షణ లభిస్తుంది.మెదడు అభివృద్ధికి, శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో దోహదపడతాయి.అని అన్నారు.ఈ కార్యక్రమం లో ఐ.సీ.డీ.ఎస్ సూపర్వైజర్ శంకరమ్మ,వైద్యాధికారి ఏ. వాహిని, వార్డు సభ్యులు ముష్కరి రమేష్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు,బాలింతలు, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
6 ఆగస్టు 2026

# కరీంనగర్‌లో '10 కోట్ల వ్యసన ముక్త మెగా క్యాంపెయిన్' ప్రారంభం






**వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

**అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**

**కరీంనగర్, ఆగస్టు 5(నవగీతం)**ప్రజాపిత బ్రహ్మా కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, మౌంట్ అబూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన 10 కోట్ల వ్యసన ముక్త మెగా క్యాంపెయిన్ లో భాగంగా బుధవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.వ్యసనాల బారిన పడకుండా యువతతో పాటు సమాజంలోని అన్ని వర్గాల్లో అవగాహన కల్పించడం, దేశవ్యాప్తంగా 10 కోట్ల మందితో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయించడమే ఈ మహా అభియాన్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాలు వ్యక్తి ఆరోగ్యాన్నే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా దెబ్బతీస్తాయని అన్నారు. వ్యసన రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువత మంచి అలవాట్లను పెంపొందించుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ జాతీయ స్థాయి మెగా క్యాంపెయిన్‌కు ఆగస్టు 2న హైదరాబాద్ శాంతి సరోవర్‌లో తెలంగాణ ఉప మండలం ఆధ్వర్యంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభోత్సవం నిర్వహించిన విషయం తెలిసిందే. అదే కార్యక్రమాన్ని జిల్లాల వారీగా నిర్వహిస్తూ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రతి ఒక్కరితో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయించే లక్ష్యంతో ఈ అభియాన్ కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ స్వామి, డీడబ్ల్యూఓసరస్వతి ఆర్డీవోలు షర్మిల జల కుమారి తహసీల్దార్లు (ఎంఆర్వోలు), వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాపిత బ్రహ్మా కుమారీస్ ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొని వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేశారు. బ్రహ్మకుమారీలు మనీషా విజయలక్ష్మి బి కే లత బి కే సారిక తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సిస్టర్ మనీషా వీడియో ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

# నూతన కలెక్టరేట్‌కు పకడ్బందీగా షిఫ్టింగ్







**సామగ్రి, ఫైళ్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి..**

**ప్రతి బ్లాక్ వారీగా ప్లానింగ్ తో ముందుకెళ్లాలి..**

**అన్ని వసతులతో ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం**

**కరీంనగర్,ఆగస్టు5(నవగీతం)** త్వరలో ప్రారంభం కానున్న నూతన జిల్లా కలెక్టరేట్ భవనానికి కార్యాలయాల తరలింపు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. పాత కలెక్టరేట్ నుంచి తరలించే ఫైళ్లు, ఫర్నిచర్, కంప్యూటర్లు, ఇతర సామగ్రి దెబ్బతినకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బుధవారం సాయంత్రం నూతన కలెక్టరేట్ భవనాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రౌండ్, మొదటి, రెండో అంతస్తుల్లో ఏర్పాటు చేస్తున్న వివిధ శాఖల కార్యాలయాలు, అధికారుల ఛాంబర్లు, అడిషనల్ కలెక్టర్ల కార్యాలయాలు, సమావేశ మందిరాలు, వీవీఐపీ గదులను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. దాదాపు రెండు గంటల పాటు ప్రతి కార్యాలయానికి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి బ్లాక్‌కు సంబంధించిన కార్యాలయాల వివరాలను డయాగ్రామ్ రూపంలో సిద్ధం చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. ఏ శాఖ ఎక్కడ పనిచేయనుందో స్పష్టంగా కనిపించేలా కార్యాలయాల కేటాయింపు చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్‌లో పనిచేసే అధికారులు, ఉద్యోగుల వివరాలను సేకరించి, ప్రణాళిక ప్రకారం సిట్టింగ్ ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. లయన్ డిపార్ట్మెంట్లకు సంబంధించి ఒకటే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయాల్లో ఏసీలు, ఫర్నిచర్, కర్టెన్లు, విద్యుత్, తాగునీటి సదుపాయం, టీ-ఫైబర్ నెట్‌వర్క్ తదితర అన్ని మౌలిక వసతులు ప్రారంభానికి ముందే సిద్ధం చేయాలని ఆదేశించారు. మీటింగ్ హాల్‌తో పాటు వీవీఐపీల సమావేశాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్‌కు వచ్చే వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, ఇతర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. రెవెన్యూ అధికారులు అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని షిఫ్టింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి నూతన కలెక్టరేట్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. పాత కలెక్టరేట్ భవనానికి సంబంధించిన రిపేర్లు చేపట్టాలని ఆదేశించారు. కొత్త కలెక్టరేట్ భవనానికి సంబంధించిన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, ఏవో సుధాకర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీచరణ్, ఆర్ అండ్ బీ ఈఈ కుమారస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**:ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**కరీంనగర్ ఆగస్టు5,(నవగీతం)** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రగతి వివరాలను సంబంధిత శాఖ అధికారుల ద్వారా తెలుసుకుంటూ క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రజల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహవినియోగాలకు ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు అందించామని వివరించారు. మల్లన్నపల్లి, గుమ్లాపూర్ గ్రామాలలో తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నందున ట్యాంకర్ ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని, అలాగే ఈ గ్రామాలలో చాలా మంది భూమి ఉండి పట్టాలు లేక వ్యవసాయం చేసుకుంటున్న రైతులు యాప్ ద్వారా యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారని ప్యాక్స్ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పలువురు సర్పంచ్ లు ఆయా గ్రామాలలో అసంపూర్తిగా ఉన్న జీపీ,వివో బిల్డింగ్ లు, రోడ్లు మంజూరు పూర్తి చేయాలని, అవసరమైన గ్రామాలలో కొత్తవి మంజూరి చేయాలని, బస్సు సౌకర్యం లేని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని, పేదలకు ఇండ్లు, గృహవినియోగదారులకు గృహజ్యోతి వర్తింపజేయాలనీ కోరగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానని, అన్ని పనులకు నిధులు మంజూరి చేశామని పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని వెల్లడించారు. వరద కాలువ నుంచి ఓ టీ ల ద్వారా గ్రామాలకు నీళ్లు అందించే పనులు త్వరలో పూర్తి చేసి ప్రజల తాగు నీటికి, రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అంతకు ముందు 15 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు, ప్రమాద వశాత్తు మరణించిన రెండు రైతు కుటుంబాలకు ఐదు లక్షల చొప్పున ప్రమాద భీమా ప్రోసీడింగ్ లు అందజేశారు. తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ వద్లూరి సరిత, ప్యాక్స్ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ఎంపిడిఓ వేణుగోపాల్ రావు, తహసీల్దార్ నవీన్ కుమార్, పలు గ్రామాల సర్పంచ్ లు, ఏ ఓ మమత, హార్టికల్చర్ అధికారి స్వాతి, విద్యుత్ ఏఈ లు చంద్రయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.





## గంజాయి సరఫరా మరియు అమ్మకానికి పాల్పడిన నిందితునికి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10,000/- జరిమాన

**కీలక తీర్పును వెలువరించిన 1వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జి.సునీత రవీంద్ర రెడ్డి**

**నిషేధిత గంజాయి పెంపకం, సరఫరా, అమ్మకానికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు: ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల/మల్లాపూర్,ఆగస్టు5,(నవగీతం)**మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసులో గంజాయి సరఫరా మరియు అమ్మకానికి పాల్పడిన నిందితుడు రావులకరి నితిన్ (21)రేగుంట గ్రామం కి చెందిన వ్యక్తి పై న్యాయస్థానం 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 10,000/- జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాలోకి వెళ్తే మార్చి 23, 2024న ఉదయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అప్పటి మల్లాపూర్ ఎస్సై పి. కిరణ్ తన సిబ్బందితో కలిసి గొర్రెపల్లి గ్రామ శివారులోని జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రేగుంట గ్రామం వైపు నుంచి బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తి పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించడంతో అనుమానించి అతడిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా, నిందితుడి వద్ద ఉన్న సంచిలో సుమారు 4 కిలోల గంజాయి లభ్యమైంది. విచారణలో నిందితుడు రావులకరి నితిన్ (21), రేగుంట గ్రామం, మల్లాపూర్ మండలం కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. గత ఏడాది కాలంగా గంజాయి విక్రయాలు చేస్తున్నట్లు, రాయికల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి కొనుగోలు చేసి మల్లాపూర్ మండలం పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకువస్తున్నట్లు విచారణలో తెలిసింది. మాదకద్రవ్యాల నిరోధక చట్టం ప్రకారం నిందితుని వద్ద ఉన్న గంజాయిని, సెల్‌ఫోన్, బైక్ ను స్వాధీనం చేసుకుని, పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసిన అప్పటి ఎస్.ఐ కిరణ్ కుమార్, మెట్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు. దర్యాప్తు సందర్భంగా సేకరించిన శాస్త్రీయ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, ఫోరెన్సిక్ నివేదికలను న్యాయస్థానంలో సమర్పించడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం ఆగస్టు5 బుధవారం 1వ అదనపు జిల్లా ఁ సెషన్స్ జడ్జి నిందితుని దోషిగా నిర్ధారించి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ. 10,000/- జరిమానా విధించారు. జిల్లాలో గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, సరఫరా మరియు అమ్మకాలపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటోందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. యువత భవిష్యత్తును నాశనం చేసే మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి పెంపకం, రవాణా, నిల్వ, సరఫరా, అమ్మకాల వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాల విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసులో నిందితులకు 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించడం పోలీస్ శాఖ సమర్థవంతమైన దర్యాప్తు, సాక్ష్యాధారాల సమర్పణకు నిదర్శనమని తెలిపారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి జగిత్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఎస్.ఐ కిరణ్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బిట్ల నర్సయ్య, సి.ఎం.ఎస్ ఎస్సై ఎస్. శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ రంజిత్ , సి.ఎం.ఎస్ కానిస్టేబుళ్లు రాజు లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## తల్లాడ మండలానికి చెందిన గోవిందు శ్రీనివాసరావుకు ఘన సన్మానం



**తల్లాడ,ఆగష్టు5(నవగీతం)**టీపీసీసీ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ నియమించిన ఏన్కూరు మండల ఇన్‌చార్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి, తల్లాడ మండలం అన్నారంగుడెం గ్రామానికి చెందిన గోవిందు శ్రీనివాసరావు బుధవారం వైరా శాసనసభ్యులు మాలోతు రామదాస్ నాయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామదాస్ నాయక్ ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని కమిటీలను అత్యంత పారదర్శకంగా ఎన్నుకోవాలని, పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పించాలని సూచించారు. ఈ భేటీలో అన్నారంగుడెం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఇండ్ల రంగ, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దశ దినకర్మ కు హాజరైన పలువురు నేతలు



**ములుగు, ఆగష్టు 05(నవగీతం)** ఇటీవల కాలంలో అకాల మరణం చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దివంగత నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాద్ రాజు దశదిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, భద్రాచలం మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ సభ్యులు పొదెం వీరయ్య బుధవారం హాజరై దివంగత నాయకుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొదెం వీరయ్య దివంగత ప్రసాద్ రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు, ప్రజలతో మమేకమై పనిచేసిన తీరును స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగించడం కార్యకర్తల బాధ్యత అని పేర్కొన్నారు. ఈయొక్క కార్యక్రమంలో నూగూరు--చర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పూనెం రాంబాబు, వాజేడు మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లె డేనర్జన్, దాసరి మురహారి, కొలపూడి వరుణ్, వాసు రాజు, జగన్ రాజు, విక్రాంత్ రాజు, కళ్యాణ్ రాజు, గొడ్డే శరత్, దాసరి సత్యనారాయణ, పాయం రాందాస్, చిచ్చడి రాఘవులు, కాళేశ్వరపు సర్వేశ్వరరావు, జాజ్జరీ మల్లయ్య, చందా చక్రపాణి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

నవగీతం తెలుగు దినపత్రిక

గురువారం
6 ఆగస్టు 2026

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ గడువు లోపు పూర్తి చేయాలి --

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత**



**మెట్ పల్లి,ఆగస్టు 5,(నవగీతం)** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగంగా నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలను పంపిణీ చేయగా, నిర్దేశించిన గడువులోపు ప్రజల వద్ద నుండి ఫారాలను సంబంధిత బీఎల్ఓలు తీసుకోవాలని అన్నారు.ప్రజలకు ఫారాలు నింపడంలో ఏవైనా సందేహాలు ఉంటే తమ పరిధిలోని బీఎల్ఓలను లేదా ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఓటరికి అవసరమైన సహాయం అందించేందుకు ఎన్నికల సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు.కొన్ని ప్రాంతాల్లో ఫారాల సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బీఎల్ఓలతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.కొంతమంది ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో నివసించడం లేదని, వేరే ప్రాంతాలకు మారారని లేదా ఇతర ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకున్నారని బీఎల్ఓల ద్వారా సమాచారం అందుతోందన్నారు. అలాంటి వారు తప్పనిసరిగా సంబంధిత ఫారాన్ని పూర్తి చేసి తమ ప్రస్తుత వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.వేరే ప్రాంతంలో ఓటు ఉన్నట్లయితే ఆ వివరాలను ఫారంలో పేర్కొనడం ద్వారా అవసరమైన మార్పులు చేసి సరైన నియోజకవర్గంలో ఓటు కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒకవేళ ఫారాలు సమర్పించకుండా ఎలాంటి స్పందన ఇవ్వకపోతే, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలన అనంతరం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రతి అర్హ ఓటరు ఆగస్టు 10వ తేదీలోపు ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓకు అందజేసి, తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో మెట్ పెల్లి తహసీల్దార్లు నీత, బి.ఎల్.వో లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్**




**జగిత్యాల, ఆగస్టు 05,(నవగీతం)**ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిశీలనను వేగవంతంగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం కొడిమ్యాల మండలం పూడూరు గ్రామంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ్ గౌడ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)తో కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా దరఖాస్తుల పరిశీలనకు సంబంధించిన రికార్డులు, పెండింగ్ దరఖాస్తుల స్థితి, పరిశీలన విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత కలిగిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తుల పరిశీలనను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, అవసరమైన సమాచారాన్ని దరఖాస్తుదారులకు ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేస్తూ ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ తనిఖీలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒడిస్సా సీఎం రేసులో ధర్మేంద్ర

**భువనేశ్వర్ :** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, దేశ విద్యావిధానంలో లోపాలపై ఇటీవల కాక్రోచ్ జనతాపార్టీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నెల రోజులు ఆందోళన చేసింది. మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేసింది. చివరకు మంత్రి ప్రధాని వారించినా వినకుండా పదవికి రాజీనామా చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో మంత్రి పదవికి రాజానీమా చేసిన ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పుడు ఏం చేయబోతున్నారు అన్న ఆసక్తి దేశవ్యాప్తంగా నెలకొంది. ఒడిశా నుంచి కొన్ని సంకేతాలు వస్తున్నాయి. రాజీనామా తర్వాత వచ్చిన ప్రతిస్పందనలు భిన్నంగా ఉన్నప్పటికీ, ఇటీవల భువనేశ్వర్ ఎయిర్‌పోర్టులో కార్యకర్తలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన గ్రాండ్ వెల్కమ్ రాష్ట్ర రాజకీయాల్లో ఆయన పాత్రను గురించి కొత్త చర్చ మొదలైంది.నైతిక బాధ్యత తీసుకుని పదవి వదిలినట్లు చెప్పుకుంటున్నా, ఈ నిర్ణయం ఆయన రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని కొందరు భావించారు. కానీ ఒడిశాలో మాత్రం విషయం వేరేలా కనిపిస్తోంది. ఎయిర్‌పోర్టు వద్ద జరిగిన స్వాగతం కేవలం ఆచారం కాదు. అనేక మంది రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కావడం ఆయనకు పార్టీలో ఇంకా బలమైన ఆధారం ఉందని స్పష్టం చేస్తోంది. రాజకీయ వర్గాలు దీన్ని ఆయన రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారే అవకాశంగా చూస్తున్నాయి.ప్రధాన్‌కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని స్థానిక స్థాయిలో చర్చలు మొదలైంది. ఇది కొందరు స్థానిక నేతల్లో కలవరాన్ని కలిగిస్తోంది. 2024లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన సీఎం అభ్యర్థిగా బలంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం వేరే నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ ఆ చర్చలు తలెత్తడం సహజం. అయితే వెంటనే మార్పు జరగడం సులభం కాదని పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుత నాయకత్వం, సామాజిక సమీకరణలు, యువత అభిప్రాయం వంటి అంశాలు ఇందులో పాత్ర పోషిస్తాయి.ఇప్పటికీ అధికారికంగా ఏమీ స్పష్టం కాలేదు. ఆయనను కొంతకాలం విశ్రాంతి తీసుకునేలా చేయడం, పార్టీ సంస్థాగత పనుల్లో నియమించడం లేదా రాష్ట్ర రాజకీయాల్లో క్రమంగా పెద్ద పాత్ర ఇవ్వడం వంటి ఎంపికలు ముందున్నాయి. ఒడిశా బీజేపీలో ఆయనకు ఉన్న ప్రభావం, ఎమ్మెల్యేల మద్దతు బలంగా ఉన్నప్పటికీ, అంతిమ నిర్ణయం కేంద్ర అధిష్ఠానం చేతుల్లోనే ఉంది. ఆ నిర్ణయం ఎలా ఉంటుందనేది రాష్ట్రంలో అధికార సమీకరణలను, అంతర్గత సమతుల్యతను ప్రభావితం చేస్తుంది.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఢిల్లీలో ఒక అధ్యాయం ముగిసినట్లు కనిపించినా, ఒడిశాలో మరో అధ్యాయం తెరవడానికి దారి తీస్తోంది. ఎయిర్‌పోర్టు స్వాగతం ఆ సంకేతాలను బలపరుస్తోంది. అయితే ఆయన రాష్ట్ర రాజకీయాల్లో ఎంత వరకు కీలకమవుతారు, సీఎం పాత్ర వైపు అడుగులు పడతాయా అనేది కేవలం సమయం, అధిష్ఠానం నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది

## డాక్టర్ రఘును కలిసిన సీపీఐ నేతలు



**మెట్ పల్లి,ఆగస్టు5,(నవగీతం)**కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆగస్టు 6వ తేదీ నుంచి 14 వరకు తాము చేపట్టే పాదయాత్రలు, సెప్టెంబర్ 1న చేపట్టే ఛలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతు తెలపాలని సీపీఐ నేతలు తెలంగాణ రక్షణ సమితి కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షులు డాక్టర్ రఘుని కలిసి విన్నవించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, పెరుగుతున్న ధరలను అరికట్టాలని, సార్వత్రిక విద్య, ఆరోగ్య సేవలు అందుబాటులోకి తేవాలని, మహిళా రిజర్వేషన్ ను వెంటనే అమలు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు డాక్టర్ రఘుకు వివరించారు. కార్మిక హక్కులను పరిరక్షించాలని, బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, దళిత, ఆదివాసీలపై దాడులు, ఆకృత్యాలను ఆపాలని డిమాండ్ చేస్తున్నామని ఇందుకు తమకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సెక్రటరీ చెన్న విశ్వనాథం, బీడీ కార్మిక సంఘం రాష్ట్ర సెక్రటరీ సుతారి రాములు, బీడీ కార్మిక సంఘం నాయకురాలు యెన్నం రాధ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాంబాబు, సీపీఐ మెట్ పల్లి టౌన్ సెక్రటరీ ఎండీ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ముత్యాల పోచమ్మ తల్లి పలారం బండి ఊరేగింపులో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



**జగిత్యాల,ఆగస్టు5,,(నవగీతం)**జగిత్యాల పట్టణంలోని పోచమ్మవాడ 38వ వార్డులో శ్రీ దుర్గా సేవ సమితి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ ముత్యాల పోచమ్మ తల్లి పలారం బండి ఊరేగింపు వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలారం బండి ఊరేగింపులో భక్తులతో కలిసి పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాలు, పోచమ్మ జాతరలు ప్రజల ఐక్యతకు నిదర్శనమని అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ ముత్యాల పోచమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య , స్థానిక కౌన్సిలర్ పిట్ట ధర్మరాజు, కొక్కు అనిత గంగాధర్, దయ్యాల చంద్రకళ శంకర్, కూతురు రాజేష్, వోద్నలల రమేష్ మరియు శ్రీ దుర్గా సేవ సమితి సభ్యులు, వార్డు ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పలారం బండి ఊరేగింపును విజయవంతం చేశారు.

## ఎన్‌హెచ్-563 భూసేకరణ బాధిత రైతులకు ఆర్బిట్రేషన్ విచారణ నిర్వహించిన జిల్లా కలెక్టర్



**జగిత్యాల,ఆగస్టు 5(నవగీతం)**జాతీయ రహదారి ఎన్‌హెచ్-563 విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించిన ఆర్బిట్రేషన్ విచారణను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం జగిత్యాల కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు.కోరుట్ల (101), తాటిపల్లి (85), చల్ గల్ (04) గ్రామాలకు చెందిన గ్రామాలకు చెందిన భూసేకరణ బాధితుల పరిహారానికి సంబంధించిన మొత్తం 189 మంది అవార్డుదారుల కేసులపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా భూమి యజమానులు, వారి తరఫున న్యాయవాదులు తమ వాదనలు వినిపించగా, సంబంధిత అధికారులు అవసరమైన వివరాలను జిల్లా కలెక్టర్ కు సమర్పించారు. అలాగే, జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి విచారణకు హాజరై సంబంధిత అంశాలపై వివరణ ఇచ్చారు. బాధిత రైతుల అభ్యర్థనలు, రికార్డులు, చట్టపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి నిబంధనల మేరకు తగిన నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి, కలెక్టరేట్ జీ-సెక్షన్ సూపరింటెండెంట్ ఉదయ్ కుమార్, న్యాయవాదులు, భూసేకరణ బాధిత రైతులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి:

**ఏఐయూకేఎస్ డిమాండ్**



**తల్లాడ, ఆగస్టు 5(నవగీతం):**వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నివిధాలా ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు తల్లాడ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐయూకేఎస్ వైరా డివిజన్ కార్యదర్శి పాశం అప్పారావు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎకరానికి 12 వేల రూపాయల నష్టపరిహారం అందించి వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.?ఈ కార్యక్రమంలో ఏఐయూకేఎస్ మండల కార్యదర్శి కొండ వెంకటేశ్వర్లు, ఎస్కే జానీ కుమారి, పుల్లమ్మ, వెంకులు, బాబు, లాల్మియా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ కళాకారులకు భరోసా కల్పించాలని 101 కిలోమీటర్ల పాదయాత్ర



**తల్లాడ, ఆగస్టు 5(నవగీతం):**తెలంగాణ ఉద్యమ కళాకారులకు ఉద్యోగ మరియు సంక్షేమ భరోసా పథకాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ, ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామం నుంచి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం వరకు కె.వి కళాబృందం అధ్యక్షుడు కాంపల్లి వంశీ ఆధ్వర్యంలో 101 కిలోమీటర్ల పాదయాత్ర ప్రారంభమైంది. తల్లాడ మండలంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పైడిపల్లి రవి, జక్కంపూడి కిషోర్ తదితరులు ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నిజమైన ఉద్యమ కళాకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కళాకారులకు తగిన ఉద్యోగ భరోసా మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర సాధనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే ముందు ఉద్యమ కళాకారులు ఎంతో నిస్వార్థంగా శ్రమించారని గుర్తు చేశారు. ఈ పాదయాత్రలో జిల్లా సాంస్కృతిక కళా మండలి అధ్యక్షులు గుడిపల్లి పుల్లారావు, తాళ్లపల్లి మనోజ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు జానకిరామ్, పలు జిల్లాల ఉద్యమ కళాకారులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## అంగన్వాడీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు



**మల్లాపూర్,ఆగస్టు5,(నవగీతం)** మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామంలో అంగన్వాడి టీచర్ల ఆధ్వర్యంలో తల్లి పాలు వారోత్సవాలు బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ గుగ్లవత్ రాజేందర్ మాట్లాడుతూ శిశువు పుట్టిన వెంటనే తల్లికి వచ్చే ముర్రిపాలను తప్పకుండా పాటించాలని అన్నారు.తల్లిపాల వలన పిల్లలకు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తోడ్పడుతుందని పేర్కొన్నారు అనంతరం అక్షర బ్యాసం నిర్వహించి ఐసిడియస్ ద్వారా వచ్చిన బాలమృతం,పప్పుసరుకులు గర్భిణీ స్త్రీలకు,బాలింతలకు అందజేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రోడ్డ హారిక.వార్డు సభ్యులు మిట్టపల్లి జలపతిరెడ్డి.యం యల్ హెచ్ పి శైలజ.ఏఎన్ఎం కోమల.అంగన్వాడి కార్యకర్త అచ్చ నర్మదా.ఆశ కార్యకర్తలు వసంత.బాలింతలు.గర్భిణీలు పిల్లలు ప్రజలు పాల్గొన్నారు

## సాయి రెడ్డిని పరామర్శించిన డాక్టర్ రఘు



**మెట్ పల్లి,ఆగస్టు5,(నవగీతం)**మెట్ పల్లి మండలం రేగుంట గ్రామానికి చెందిన గడ్డం సాయి రెడ్డిని తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ రఘు పరామర్శించారు. సాయి రెడ్డి కాలుకి ఇటీవల శస్త్రచికిత్స జరగ్గా.. విషయం తెలుసుకున్న డాక్టర్ రఘు బుధవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.వారి వెంట చెట్లపల్లి సుఖేంధర్ గౌడ్, మేడిచల్మల నాని, సుద్దాల నాగరాజు, లింగంపల్లి ప్రణీత్, రెండ్ల రాజన్న ఉన్నారు.

# వరుణ్ తేజ్ ఈసారి హిట్ కొట్టాల్సిందే



మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా, రితికా నాయక్‌తో కలిసి నటిస్తున్న చిత్రం కొరియన్ కనకరాజు. ఈ సినిమా వరుణ్ తేజ్ కెరీర్‌లో ఈసారి కొరియన్ కనకరాజు సినిమా అత్యంత కీలకంగా మారింది. వరుసగా వచ్చిన ఫ్లాపుల కారణంగా అతడి మార్కెట్ బాగా పడిపోయింది. మట్కా, ఆపరేషన్ వాలంటైన్, గాండీవధారి అర్జున వంటి సినిమాలు ఒక్కదాన్ని మించి ఇంకోటి ఫ్లాప్ కావడంతో వరుణ్ మార్కెట్ దెబ్బతింది. ఈ విషయాన్ని వరుణ్ తేజ్ స్వయంగా అంగీకరించాడు. అవన్నీ తనకు అనుభవాలుగా మిగిలాయని చెప్పాడు. ఇప్పుడు మాత్రం పరిస్థితులు కొంతవరకు అనుకూలంగా ఉన్నాయి. కొరియన్ కనకరాజు టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. దాంతో పాటు యూనిట్ చేసిన ప్రచారం ప్రేక్షకులకు విస్తృతంగా చేరింది. విడుదలకు ముందే సినిమాకు బజ్ రావడం కొంత వరకు వరుణ్ తేజ్‌కు అదృష్టమనే చెప్పాలి. ఈ సినిమా దర్శకుడికి కూడా ఇటీవల కాలంలో చెప్పుకోదగ్గ ట్రాక్ రికార్డు లేకపోవడంతో ఈ సినిమా విజయం అతనికి అత్యవసరం. ఇక ఈ చిత్ర హీరోయిన్ రితికా నాయక్ ఇప్పటికే హిట్‌ల మీద ఉన్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రధానంగా హీరో-దర్శకుడి భవిష్యత్తును నిర్ణయించనుంది. వరుణ్ తేజ్ కు ఈసారి హిట్ తప్పనిసరి. బజ్, ప్రచారం, అంచనాలు అన్నీ కలిసొచ్చాయి. ఇప్పుడు ప్రేక్షకుల తీర్పే కీలకం. ఈ చిత్రం ఆగస్ట్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. కొరియా బ్యాక్ డ్రాప్‌లో హారర్ యాక్షన్ కామెడీగా ఈ సినిమా తెరకెక్కుతుంది. వరుణ్ ఇందులో రెండు డిఫరెంట్ పాత్రల్లో నటించాడు.

## నాన్‌స్టాప్ షెడ్యూల్‌లో'ఫౌజీ'





అగ్ర కథానాయకుడు ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్' 'ఫౌజీ' చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఇటలీ విహారయాత్ర నుంచి తిరిగొచ్చిన ఆయన హైదరాబాద్‌లో జరుగుతున్న 'ఫౌజీ' షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. డిసెంబర్ 3న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్వరితగతిన ఈ సినిమా షూట్‌ను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభాస్ ఉన్నారట. అందుకోసం ఆగస్ట్ నెల మొత్తాన్ని ఈ సినిమాకే కేటాయించారని తెలిసింది. తాజా షెడ్యూల్ నాన్‌స్టాప్‌గా జరుగుతుందని, ప్రభాస్‌పై కొన్ని యాక్షన్ ఘట్టాలతో పాటు కీలక సన్నివేశాలను తెరకెక్కించబోతున్నారని తెలిసింది. 1940 దశకం నాటి స్వాతంత్ర్య సంగ్రామం, రెండో ప్రపంచయుద్ధం తాలూకు ఘటనల నేపథ్యంలో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ హైప్‌ని క్రియేట్ చేశాయి. ఇమాన్వి, మిథున్‌చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణం: మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, భూషణ్ కుమార్, రచన-దర్శకత్వం: హను రాఘవపూడి.

## కార్తి జోడీగా?



ప్రస్తుతం తమిళనాడు రాజకీయ పరిణామాలకు కథానాయిక త్రిష కేంద్రబిందువుగా మారింది. మరోవైపు ఆమె రాజకీయాల్లోకి రావాలంటూ అభిమానుల నుంచి ఒత్తిడి పెరుగుతున్నది. అయితే ఈ విషయాలేవీ పట్టించుకోకుండా కొత్త సినిమా సన్నాహల్లో త్రిష బిజీగా ఉంది. తాజా సమాచారం ప్రకారం కార్తి జోడీగా ఈ భామ ఓ సినిమా చేయబోతున్నట్లు తెలిసింది. మోహన్‌రాజా దర్శకత్వంలో కార్తి కొత్త చిత్రాన్ని ఇటీవలే ప్రకటించారు. త్వరలో షూటింగ్ ప్రారంభంకానుంది. ఈ సినిమా కోసం కథానాయిక అన్వేషణలో ఉన్న చిత్రబృందం నయనతార, త్రిష పేర్లను ప్రముఖంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. నయనతార ప్రస్తు తం వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో ఆమె డేట్స్ సర్దుబాటు అయ్యే అవకాశాలు లేవని అంటున్నారు. దాంతో ఈ సినిమాలో త్రిష ను నాయికగా ఖరారు చేయబోతున్నారని చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్న ది. 'పొన్నియన్ సెల్వ న్' చిత్రంలో కార్తి-త్రిష జోడీగా నటించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్ అభిమానుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది.





## అజిత్ రేసింగ్ జర్నీపై డాక్యుమెంటరీ

తమిళ అగ్ర హీరో అజిత్‌కు మోటార్‌స్పోర్ట్స్‌లో మంచి ప్రావీణ్యం ఉన్న విషయం తెలిసిందే. ప్రొఫెషనల్ రేస్‌కార్ డ్రైవర్ అయిన అజిత్ ఇప్పటికే పలు అంతర్జాతీయ రేసింగ్ పోటీల్లో కూడా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన రేసింగ్ జర్నీని ఆవిష్కరిస్తూ 'గ్లాడియేటర్స్' పేరుతో రూపొందించిన తాజా డాక్యుమెంటరీ త్వరలో థియేట్రికల్ రిలీజ్ కానుంది. బుధవారం ఈ విషయాన్ని వెల్లడిస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఏ.ఎల్.విజయ్ దర్శకత్వంలో అజిత్ సతీమణి షాలిని ఈ డాక్యుమెంటరీని నిర్మించారు. మోటార్‌స్పోర్ట్స్ ప్రయాణంలో అజిత్ ఎదుర్కొన్న సవాళ్లు, పట్టుదలతో లక్ష్యాలను ఛేదించిన సంఘటనలను ఈ డాక్యుమెంటరీలో చూపించామని, అజిత్ జీవితం తాలూకు మరో కోణాన్ని ఆవిష్కరిస్తూ స్ఫూర్తివంతంగా ఉంటుందని దర్శకుడు ఏ.ఎల్.విజయ్ పేర్కొన్నారు. ఈ డాక్యుమెంటరీకి జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతాన్నందించారు. ప్రస్తుతం అజిత్ తన 64వ చిత్రంలో నటిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రానికి 'డేర్‌డెవిల్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.